# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాద్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020

- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 212 | పేజీలు : 08 | బుధవారం | 12-08-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.




## జెండాలను నేలపై పడేయకూడదు ఫ్లాగ్ కోడ్‌ను పాటించాలి

**స్వాతంత్ర్య దినోత్సవ వేళ కేంద్రం ఆదేశాలు**

- అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఫ్లాగ్ కోడ్‌పై కేంద్రం ఆదేశాలు
- త్రిరంగా గౌరవానికి భంగం కలగకుండా చూడాలని సూచన
- హర్ ఘర్ త్రిరంగా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ప్రజలకు పిలుపు

2

హైదరాబాద్ పల్స్,డెస్క్

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు దేశం సిద్ధమవుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం కీలక సూచనలు చేసింది. జాతీయ జెండాను ప్రదర్శించే సమయంలో ఫ్లాగ్ కోడ్ ఆఫ్ ఇండియాను తప్పనిసరిగా పాటించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యంగా వేడుకల సందర్భంగా కాగితంతో తయారు చేసిన జాతీయ జెండాలను ఉపయోగించిన అనంతరం వాటిని నేలపై పడేయడం, ఎక్కడపడితే అక్కడ పారవేయకూడదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన "హర్ ఘర్ తిరంగా" ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన అన్నారు. ఈ మేరకు అమిత్ షా తన ఎక్స్ ఖాతా ద్వారా ప్రజలకు పిలుపునిచ్చారు.

**త్రిరంగాకు తగిన గౌరవం ఇవ్వాలి**

జాతీయ జెండా కేవలం ఒక వస్త్రం కాదని, అది దేశ ప్రజల ఆశలు, ఆకాంక్షలు, త్యాగాలకు ప్రతీక అని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పేర్కొంది. అందువల్ల జెండాను ప్రదర్శించే సమయంలో తగిన గౌరవం, మర్యాద పాటించాలని సూచించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా పెద్దఎత్తున త్రిరంగా ర్యాలీలు, యాత్రలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రజలు కాగితం లేదా ఇతర అనుమతించిన వాటితో తయారు చేసిన చిన్న జెండాలను ఉపయోగిస్తుంటారు. అయితే కార్యక్రమాలు ముగిసిన తర్వాత వాటిని రోడ్లపై, చెత్త కుప్పల్లో లేదా నేలపై పడేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్రం స్పష్టం చేసింది.

**అన్ని రాష్ట్రాలకు లేఖ**



## మెట్రో రైలుపై సమీక్ష

- రద్దీకి తగ్గట్లుగా కొత్త కోచ్‌ల కొనుగోలు, ఓల్డ్ సిటీ పనుల్లో వేగం
- మెట్రో రివ్యూలో రేవంత్ రెడ్డి ఆదేశం
- మెట్రో రైలుపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
- మెట్రో రద్దీకి అనుగుణంగా కొత్త కోచ్‌లు కొనుగోలు చేయాలని అధికారులకు ఆదేశాలు
- డిసెంబర్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ చర్చ

2

**హైదరాబాద్ మెట్రోరైలు రెండో దశలో భాగంగా పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ మెట్రో రైల్‌పై ఉన్నతాధికారులతో రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. మెట్రో రైల్‌పై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించారు...**

హైదరాబాద్ పల్స్,డెస్క్

ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు ఏడున్నర కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ కారిడార్‌లో మెట్రో పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియను మొదలు పెట్టాలని చెప్పారు. మెట్రో విస్తరణకు కోసం పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. రోజురోజుకు పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రయాణీకుల రద్దీకి తగినట్టుగా మెట్రో రైల్‌కు అదనపు బోగీలను జత చేయాలని సూచించారు. మెట్రో రైల్ కోచ్‌లను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**గ్లోబల్ సమ్మిట్‌పై అధికారులతో చర్చ**

మెట్రో రెండో ఫేజ్‌లో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చంద్రాయణగుట్ట వరకు ఏడున్నర కిలోమీటర్ల కారిడార్ కోసం ప్రస్తుత టెక్నాలజీపై ఢిల్లీ మెట్రోను సంప్రదించి సలహాలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. డిసెంబర్‌లో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌పై కూడా అధికారులతో రేవంత్ రెడ్డి

## షెల్ కంపెనీలతో లబ్ధి పొందుతున్నారు

- సీఎం రేవంత్ రెడ్డి సోదరులపై కేటీఆర్ సంచలన ఆరోపణలు
- సీఎం సోదరులు షెల్ కంపెనీలతో లబ్ధి పొందుతున్నారని కేటీఆర్ ఆరోపణ
- టెసరాక్ కంపెనీకి రూ.200 కోట్ల విలువైన భూమి కేటాయించారని విమర్శ
- కేవలం లక్ష రూపాయల మూలధనంతో కంపెనీ ఏర్పాటు చేశారని వెల్లడి
- రేవంత్ సోదరులకు షెల్ కంపెనీలు.. భారీగా లబ్ధి: కేటీఆర్ సంచలన ఆరోపణలు

2



హైదరాబాద్ పల్స్,డెస్క్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు నామమాత్రపు అర్హతలతో భారీ కంపెనీలను రిజిస్టర్ చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పెద్ద ఎత్తున లబ్ధి పొందుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి సోదరులు బడా

## ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం..

**ఆగస్టు 15ను పండుగలా జరుపుకుందాం: మోదీ**

- 'హర్ ఘర్ తిరంగా'లో పాల్గొనాలని మోదీ పిలుపు
- ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరేయాలని సూచన
- స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని విజ్ఞప్తి
- 'వికసిత్ భారత్' నిర్మాణానికి ప్రతిజ్ఞ చేయాలని పిలుపు

ఈ ఏడాది 'వందేమాతరం'కు ప్రత్యేక ప్రాధాన్యం

2



హైదరాబాద్ పల్స్,డెస్క్

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రజలు చురుగ్గా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళు

## అందుకే రేవంత్ రెడ్డి వద్దకు వెళ్లి కండువా కప్పుకున్నా

**పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్య**

పెండింగ్ బిల్లులకు ప్రభుత్వం సగం నిధులే ఇచ్చిందని అసంతృప్తి

అన్నం పెట్టిన వారిని ఎప్పటికీ మర్చిపోలేనని వ్యాఖ్య

ప్రస్తుతం ముఖ్యమంత్రి, మంత్రులు ఫోన్లు ఎత్తడం లేదని ఆరోపణ



2

హైదరాబాద్ పల్స్,డెస్క్

తన నియోజకవర్గ అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరానని, పదవుల కోసమో, డబ్బు కోసమో కాదని బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం

---

తెలంగాణను హెచ్ఐవీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం: దామోదర రాజనర్సింహ 2

పేద పిల్లల కలలకు చిరునామాగా.. యంగ్ ఇండియా స్కూల్స్: సీఎం రేవంత్ రెడ్డి 2

పింగళి వెంకయ్యకు భారతరత్న పురస్కారం ఇవ్వాలి... ప్రధానికి వీహెచ్ లేఖ 2

మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం 2

## దేశ నిర్మాణంలో భాగస్వాములు కండి

**సీఎం చంద్రబాబు పిలుపు**

2

- 'పార్ట్‌నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్'కు సీఎం చంద్రబాబు పిలుపు
- 'రోడ్ డాక్టర్' పేరుతో గుంతల్లేని రహదారుల మిషన్
- ప్రజలు, ఉద్యోగులు అంతా భాగస్వాములు కావాలని సూచన
- జులై నెలలో 10.70 శాతం ఆర్థిక వృద్ధి నమోదు
- ఎల్ నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక



హైదరాబాద్ పల్స్,డెస్క్

ప్రజలు, ఉద్యోగులు, అధికారుల సమష్టి భాగస్వామ్యంతో 'పార్ట్‌నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో గుంతలు లేని రహదారులే లక్ష్యంగా 'రోడ్ డాక్టర్' పేరుతో 'జీరో పాట్ హోల్ మిషన్'ను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత

## 'కేరళ' ఇకపై 'కేరళం'..

**బిల్లుకు లోక్‌సభ ఆమోదం**

2

కేరళ పేరును 'కేరళం'గా మార్చే బిల్లుకు లోక్‌సభ ఆమోదం

విపక్షాల నిరసనల మధ్య చర్చ లేకుండానే ఆమోదముద్ర

కేరళ అసెంబ్లీ చేసిన తీర్మానం మేరకు కేంద్రం చర్యలు



హైదరాబాద్ పల్స్,డెస్క్

కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మారుస్తూ ప్రతిపాదించిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. మంగళవారం విపక్ష సభ్యుల నినాదాలు, నిరసనల మధ్య ఎటువంటి చర్చ లేకుండానే ఈ బిల్లును సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఫలితంగా

షెల్ కంపెనీలతో

# లబ్ధి పొందుతున్నారు

మొదటి పేజీ రువాయి

కంపెనీలకు యజమానులుగా మారుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. కనీసం ఒక్క ఉద్యోగి కూడా లేని కంపెనీలను చిన్న నివాసాల చిరునామాలతో రిజిస్టర్ చేయించారని పేర్కొన్నారు. అటువంటి ఒక కంపెనీకే దాదాపు రూ. 200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని ప్రభుత్వం కట్టబెట్టిందని విమర్శించారు. ముఖ్యంగా, అనుముల కొండల్ రెడ్డి తన లింక్డ్ఇన్ ప్రొఫైల్‌లో 'టెసరాక్' కంపెనీకి ఛైర్మన్‌గా ఉన్నట్లు పేర్కొన్నారని తెలిపారు. మరో సోదరుడు జగదీశ్ రెడ్డి కాంట్రాక్టులు దక్కించుకుంటుండగా, ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డికి సింగరేణిలో కాంట్రాక్ట్ కట్టబెట్టారని ఆరోపించారు.ప్రతిపాదిత ఫోర్త్ సిటీ పరిధిలోని భూముల కేటాయింపులపై బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ ఒకరోజు ముందే ఇవే తరహా ఆరోపణలు చేసిన నేపథ్యంలో కేటీఆర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కొండల్ రెడ్డి ఛైర్మన్‌గా ఉన్న టెసరాక్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మహేశ్వరం మండలం రావిర్యాలలో సుమారు ఐదు ఎకరాల భూమిని కేవలం రూ. 7 కోట్లకు కేటాయించారని, దాని అసలు మార్కెట్ విలువ రూ. 100 కోట్లకు పైగా ఉంటుందని క్రిశాంక్ పేర్కొన్నారు. ఆ కంపెనీకి కేవలం రూ.లక్ష మూలధనం ఉందని, పటాన్‌చెరులోని ఒక చిన్న నివాసం నుంచి కార్యకలాపాలు సాగిస్తోందని ఆరోపించారు. కాగా, క్రిశాంక్ చేసిన ఆరోపణలను మంత్రి డి.శ్రీధర్ బాబు తీవ్రంగా ఖండించారు

# 'కేరళ' ఇకపై 'కేరళం'..

మొదటి పేజీ రువాయి

రాష్ట్రం పేరు మార్పు ప్రక్రియలో మరో కీలక ఘట్టం పూర్తయింది.కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో లేకపోవడంతో, ఆయన తరపున హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ 'కేరళ (పేరు మార్పు) బిల్లు, 2026'ను ప్రవేశపెట్టారు. ఢిల్లీలో నిరసనకారులపై పోలీసుల చర్యలతో పాటు ఇతర కీలక అంశాలపై అమిత్ షా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఆందోళన చేపట్టాయి. ఈ గందరగోళ పరిస్థితుల నడుమనే బిల్లుకు సభ ఆమోదం ముద్రవేసింది.మలయాళంలో తమ రాష్ట్రాన్ని 'కేరళం' అని పిలుస్తారని, అధికారికంగా కూడా అదే పేరును ఖరారు చేయాలని కేరళ శాసనసభ 2024 జూన్‌లో తీర్మానం చేసింది. ఈ ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన అనంతరం, రాష్ట్రపతి ఈ ముసాయిదా బిల్లును రాష్ట్ర అసెంబ్లీకి పంపారు. 2026 జులైలో అసెంబ్లీ దీనికి ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. ఈ బిల్లు ఆమోదంతో రాజ్యాంగంలోని మొదటి షెడ్యూల్‌లో సవరణలు జరగనున్నాయి.

# దేశ నిర్మాణంలో భాగస్వాములు కండి

మొదటి పేజీ రువాయి

సులభతరంగా చేరువ చేయడం ద్వారా ప్రతి ఒక్కరినీ జాతి నిర్మాణంలో భాగస్వాములను చేయాలని ఆకాంక్షించారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రతి అధికారి, ఉద్యోగి అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టేలా 'రోడ్ డాక్టర్' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని స్పష్టం చేశారు.ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి పనులను చిత్తశుద్ధితో చేపట్టినప్పుడు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుందని, భోగాపురం విమానాశ్రయ పనుల పురోగతికి లభిస్తున్న స్పందనే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. వాస్తవాలను ప్రజలకు వివరిస్తే వారే ప్రభుత్వానికి అండగా నిలుస్తారని, కర్నూలులో డీఎస్సీ-2025 ఉపాధ్యాయ అభ్యర్థులు చేపట్టిన కార్యక్రమమే ఇందుకు ఉదాహరణ అని తెలిపారు. జులై నెలలో రాష్ట్రం 10.70 శాతం ఆర్థిక వృద్ధిని సాధించిందని వెల్లడించిన ఆయన, రాబోయే రోజుల్లో ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పింగళి వెంకయ్యకు భారతరత్న పురస్కారం ఇవ్వాలి... ప్రధానికి వీహెచ్ లేఖ

మొదటి పేజీ రువాయి

న్యూఢిల్లీ, ఆగస్టు 11: జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్యకు భారతరత్న పురస్కారం ఇవ్వాలని తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ సలహాదారుడు హనుమంతరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. స్వాతంత్ర్య సమరయోధుడుకి, భారత జాతీయ పతాక రూపకర్తకు దేశం అందించగల ఏకైక సముచితమైన నివాళి ఇదే అని చెప్పుకొచ్చారు. భారత జాతీయ పతాకం(త్రివర్ణ పతాకం) ప్రాథమిక రూపాన్ని రూపొందించిన ఘనత పింగళి వెంకయ్యకే దక్కుతుందన్నారు. హైదరాబాద్‌లో పింగళి వెంకయ్య విగ్రహాన్ని తాను ఏర్పాటు చేసినట్లు లేఖలో తెలిపారు.ఇప్పుడు భారత జాతీయ పతాకం ప్రపంచవ్యాప్తంగా ప్రాముఖ్యాన్ని, విస్తృత గుర్తింపును సాధించిందని వీహెచ్ అన్నారు. దివంగత పింగళి వెంకయ్య సేవలను తక్కువ చేసి చూడటం.. భారత పతాక రూపకర్తకు జరిగిన అవమానమన్నారు. జాతీయ పతాక రూపకర్తకు భారతరత్న ఇవ్వాలని.. దేశ ప్రజలు ఇదే అభిప్రాయాన్ని కలిగి ఉన్నారని వెల్లడించారు.'ప్రధాని మోదీ 'హర్ ఘర్ తిరంగా' అంటున్నారు.. మంచిదే. జాతీయ జెండా రూపకల్పన చేసిన పింగళి వెంకయ్యకు సరైన న్యాయం జరగాలంటే భారతరత్న ఇవ్వాల్సిందే. పింగళి వెంకయ్యకు న్యాయం జరగడం వల్ల ప్రజల్లోకి ఒక మంచి సందేశం వెళ్తుంది. స్వాతంత్రం వచ్చిన 25 ఏళ్ల తర్వాత ఆర్ఎస్ఎస్ కార్యాలయంపై జాతీయ జెండా ఎగరవేశారు' అని ప్రధానికి వీహెచ్ లేఖ రాశారు.

# ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం..

మొదటి పేజీ రువాయి

లర్పించాలని కోరారు. 'హర్ ఘర్ తిరంగా.. ఘర్ ఘర్ తిరంగా.. హర్ మన్ తిరంగా' అంటూ దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపారు.ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను షేర్ చేసుకున్న ప్రధాని.. ఆగస్టు 15ను గర్వంగా జరుపుకోవాలని సూచించారు. 'వికసిత్ భారత్' నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. "ప్రతి ఇంటా హర్ ఘర్ తిరంగాను ఓ వేడుకగా మార్చుకుందాం" అని పేర్కొన్నారు.ఇటీవల 'ఎక్స్' వేదికగానూ మోదీ 'హర్ ఘర్ తిరంగా'లో ఉత్సాహంగా పాల్గొనాలని ప్రజలను కోరారు. త్రివర్ణ పతాకం దేశ గర్వానికి ప్రతీక అని తెలిపారు. దేశం కోసం అత్యుత్తమంగా పనిచేయాలనే స్ఫూర్తిని అది అందిస్తుందని పేర్కొన్నారు.ఈ ఏడాది 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని 'వందేమాతరం' 150వ వార్షికోత్సవానికి అంకితం చేస్తున్నట్లు ప్రధాని తెలిపారు. దేశభక్తి, త్రివర్ణం పతాకంపై గర్వం, మాతృభూమిపై ప్రేమను చాటేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా ప్రారంభమైన 'హర్ ఘర్ తిరంగా' ద్వారా జాతీయ పతాకంతో ప్రజలకు మరింత వ్యక్తిగత అనుబంధం ఏర్పడేలా ప్రోత్సహిస్తున్నారు

# మెట్రో రైలు పై సమీక్ష

మొదటి పేజీ రువాయి

చర్చించారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ వ్యాపార రంగాల్లో గుర్తింపు పొందిన ప్రముఖులను సమ్మిట్‌లో సన్మానించేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు.

పెట్టుబడుల్లో మరింత పురోగతి సాధించాలి

తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో సమ్మిట్ ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని, గత సంవత్సరం నిర్వహించిన సమ్మిట్?లో తెలంగాణ రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, పురోగతికి సంబంధించి పూర్తి వివరాలను ఇవ్వాలని అధికారులను రేవంత్ రెడ్డి ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతి సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. సమావేశంలో సీఎం సలహాదారు రామకృష్ణరావు, సీఎస్ సంజయ్ జాజు, ఉన్నతాధికారులు ఎన్వీఎస్ రెడ్డి, సర్ఫరాజ్ అహ్మద్, అజిత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అందుకే రేవంత్ రెడ్డి వద్దకు వెళ్లి కండువా కప్పుకున్నా

మొదటి పేజీ రువాయి

శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. పెండింగ్ బిల్లులకు సంబంధించి ప్రభుత్వం సగం నిధులే విడుదల చేయడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం బిర్కూర్‌లో పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.పెండింగ్ బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారని పోచారం తెలిపారు. గత నవంబర్‌లో పార్టీ మారిన ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో ఇదే విషయాన్ని తాను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానని గుర్తుచేశారు. ఆరు నెలల్లోగా బిల్లులు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినప్పటికీ, ప్రస్తుతం సగం నిధులే విడుదలయ్యాయని పేర్కొన్నారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మిగతా మొత్తాన్ని మంజూరు చేయలేదని ఆయన ఆరోపించారు.

# పేద పిల్లల కలలకు చిరునామాగా.. యంగ్ ఇండియా స్కూల్స్: సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ రువాయి

హైదరాబాద్, ఆగస్టు 11: తెలంగాణ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రతి విద్యార్థికీ ప్రపంచ స్థాయి విద్యను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో ఈ విద్యాలయాలు నిర్మితమవుతున్నాయని సీఎం వెల్లడించారు.

సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్..

'భవనాలు నిర్మించడం సులభమే.. కానీ కలలకు పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి సంకల్పం ఉండాలి. ఆ సంకల్పంతోనే తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ వేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. ఆర్థిక, సామాజిక అసమానతలకు ముగింపు పలుకుతూ.. కులం, మతం, ప్రాంతం, కుటుంబ నేపథ్యం అనే గీతలను చెరిపేస్తూ.. ప్రతి చిన్నారికీ ప్రపంచ స్థాయి విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో నిర్మితమవుతున్న ఈ విద్యాలయాలు.. పేద కుటుంబాల పిల్లలను రేపటి శాస్త్రవేత్తలుగా, పరిపాలకులుగా, పారిశ్రామికవేత్తలుగా, నవభారత నిర్మాతలుగా తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలుగా నిలవబోతున్నాయి. పేద పిల్లల కలలకు చిరునామాగా... తెలంగాణ మోడల్‌కు ప్రతీకగా... యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తరతరాల భవిష్యత్తును మార్చబోతున్నాయి' అంటూ ఎక్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్ చేశారు.

# ఫ్లాగ్ కోడ్‌ను పాటించాలి

మొదటి పేజీ రువాయి

జాతీయ జెండా ప్రదర్శనకు సంబంధించిన నిబంధనలు, విధానాలు, సంప్రదాయాలపై ప్రజలతో పాటు ప్రభుత్వ సంస్థలు, వివిధ ఏజెన్సీల్లో కూడా తగినంత అవగాహన లేదని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ గుర్తించింది. ఈ నేపథ్యంలో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు ప్రత్యేకంగా లేఖ పంపింది. జాతీయ జెండాకు ఎల్లప్పుడూ సముచితమైన, గౌరవప్రదమైన స్థానం కల్పించాలని కేంద్రం సూచించింది. ఫ్లాగ్ కోడ్ ఆఫ్ ఇండియాలో పేర్కొన్న నిబంధనలను ప్రజలకు తెలియజేయడానికి విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరింది. ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ద్వారా కూడా ప్రచారం నిర్వహించాలని రాష్ట్రాలకు సూచించింది.

**ఎలాంటి వస్త్రంతో జెండా తయారు చేయాలి?**

కేంద్రం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం జాతీయ జెండాను చేతితో నేసిన లేదా యంత్రంతో తయారు చేసిన వస్త్రంతో రూపొందించవచ్చు. ఇందుకోసం పత్తి, పాలిస్టర్, ఉన్ని, పట్టు లేదా ఖాదీ వంటి వస్త్రాలను ఉపయోగించవచ్చని హోం మంత్రిత్వ శాఖ తెలిపింది. జాతీయ జెండాను సాధారణ రోజుల్లోనూ, ప్రత్యేక సందర్భాల్లోనూ పౌరులు, ప్రైవేట్ సంస్థలు, విద్యాసంస్థలు ప్రదర్శించవచ్చు. అయితే జెండా గౌరవానికి, ప్రతిష్ఠకు ఎలాంటి భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. ఫ్లాగ్ కోడ్ ఆఫ్ ఇండియా 2002కు, 2022 జులై 19న చేసిన సవరణలను కూడా కేంద్రం ప్రస్తావించింది. బహిరంగ ప్రదేశంలో లేదా పౌరుల ఇళ్లపై జాతీయ జెండాను పగలు, రాత్రి వేళల్లోనూ ప్రదర్శించవచ్చని పేర్కొంది. అయితే జెండాను ప్రదర్శించే సమయంలో అది శుభ్రంగా, గౌరవప్రదంగా ఉండాలి. పాడైపోయిన, చిరిగిపోయిన లేదా దెబ్బతిన్న జాతీయ జెండాను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రదర్శించకూడదని కేంద్రం స్పష్టం చేసింది.

**ఇతర జెండాలతో కలిపి వద్దు**

ఒకే స్తంభంపై జాతీయ జెండాతో పాటు ఇతర జెండాలను ఎగురవేయకూడదని కేంద్రం స్పష్టం చేసింది. అలాగే త్రివర్ణ పతాకం కంటే ఎత్తులో, దాని పైన లేదా దాని పక్కన మరే ఇతర పార్టీ జెండా లేదా అలంకరణ పట్టీలను ఉంచకూడదని తెలిపింది. జాతీయ జెండాను ప్రత్యేకమైన, గౌరవప్రదమైన స్థానంలోనే ప్రదర్శించాలని సూచించింది. ఫ్లాగ్ కోడ్‌లో పేర్కొన్న నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరింది. జాతీయ జెండాను ఏ వాహనంపైనైనా ఇష్టానుసారం ఎగురవేయడానికి అనుమతి లేదని కేంద్రం తెలిపింది. ఫ్లాగ్ కోడ్‌లోని నిర్దిష్ట నిబంధనల ప్రకారం రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, గవర్నర్లు వంటి ప్రముఖుల అధికారిక వాహనాలపై మాత్రమే జాతీయ జెండాను ప్రదర్శించవచ్చు. ఇతర వాహనాలపై జాతీయ జెండాను ఎగురవేయకూడదని స్పష్టం చేసింది.

**'హర్ ఘర్ తిరంగా'లో భాగస్వాములు కావాలి**

మరోవైపు, దేశవ్యాప్తంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని అమిత్ షా ప్రజలను కోరారు. "ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ ఉద్యమం దేశ ప్రజలందరినీ ఏకం చేసే కార్యక్రమంగా నిలుస్తోంది. ఈ ఏడాది వందేమాతరం 150వ వార్షికోత్సవం కూడా జరుపుకుంటున్న నేపథ్యంలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమానికి మరింత ప్రత్యేకత ఏర్పడింది. త్రిరంగా యాత్రలు, తిరంగా ర్యాలీలు, సామూహిక వందేమాతరం గీతాలాపన వంటి కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి. అలాగే ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయడంతో పాటు, కార్యక్రమంలో భాగంగా "హర్ ఘర్ తిరంగా అధికారిక వెబ్‌సైట్"లో తమ సెల్ఫీని అప్‌లోడ్ చేయాలి" అని అమిత్ షా ప్రజలను కోరారు. ఈ వెబ్‌సైట్‌లో ఆగస్ట్ 9 నుంచి 17 వరకు సెల్ఫీలను అప్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని కల్పించారు. ఇప్పటికే 57వేలకు పైగా మంది తమ సెల్ఫీలను ఈ వెబ్?సైట్?లో అప్లోడ్? చేశారు.

# తెలంగాణను హెచ్‌ఐవీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం: దామోదర రాజనర్సింహ

మొదటి పేజీ రువాయి

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు బుధవారం భారీ ర్యాలీని నిర్వహించనున్నట్లు మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఆగస్టు 12 నుంచి రెండు నెలల పాటు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. హెచ్ఐవీ, ఎయిడ్స్, సిఫిలిస్ నియంత్రణే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రేపు ఉదయం 7 గంటలకు హైదరాబాద్‌లో భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు చెప్పారు. ఐమాక్స్ పక్కన ఉన్న హెచ్ఎండీఏ గ్రౌండ్స్ నుంచి నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ కొనసాగనుందని మంత్రి తెలిపారు. సుమారు 1500 మంది ర్యాలీలో పాల్గొననున్నట్లు వెల్లడించారు.హెచ్ఐవీ బాధితులకు మెరుగైన వైద్య చికిత్స అందించడంపై ప్రత్యేక దృష్టి సారించామని మంత్రి తెలిపారు. హెచ్ఐవీ ఇతరులకు, ముఖ్యంగా పుట్టబోయే శిశువులకు సంక్రమించకుండా అవగాహన కల్పిస్తున్నామన్నారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ నిర్మూలన ప్రచారంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 'బి పాజిటివ్ టు స్టాప్ హెచ్ఐవీ పాజిటివ్' నినాదంతో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. తెలంగాణను హెచ్ఐవీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. కాగా.. రేపు ఈ ర్యాలీని మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్.. జెండా ఊపి ప్రారంభించనున్నారు. కాలేజీ విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు ర్యాలీలో పాల్గొననున్నారు.

# పింగళి వెంకయ్యకు భారతరత్న పురస్కారం ఇవ్వాలి... ప్రధానికి వీహెచ్ లేఖ

మొదటి పేజీ రువాయి

హైదరాబాద్, ఆగస్టు 11 : తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహించాలని నిర్ణయించింది. ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనుంది. ఈ మేరకు జీవో ఎంఎస్ నంబర్-4 ద్వారా ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది.ప్రజావాణిపై ఎంపీడీవోలకు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించనుంది. ఆగస్టు 13వ తేదీన ఉదయం10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వారికి శిక్షణ ఇవ్వనుంది. హైదరాబాద్ ప్రజాభవన్‌లో ఈ శిక్షణ కార్యక్రమం జరగనుంది. మండల నోడల్ అధికారులైన ఎంపీడీవోలు తప్పనిసరిగా ఈ శిక్షణకు హాజరు కావాలని తెలంగాణ సర్కార్ ఆదేశాలు జారీ చేసి

# కింగ్‌స్టన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో ఘనంగా బోనాల పండుగ సంబరాలు

**తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా కింగ్‌స్టన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో బోనాల పండుగ వేడుకలు.**

**మన సంస్కృతి..మన సంప్రదాయం.. మన బాధ్యత**

**విద్యార్థుల చేతుల్లో తెలంగాణ సంప్రదాయ వైభవం**

**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను ప్రతిబింబించేలా కింగ్‌స్టన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో వేడుకలు.**





హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 11, తెలంగాణ బ్యూరో : సిద్దిపేట జిల్లా పొన్నాలలోని కింగ్‌స్టన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్లో బోనాల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు, విలువలను విద్యార్థులకు పరిచయం చేసి, వాటి ప్రాధాన్యతను తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు భక్తిశ్రద్ధలతో అమ్మవారి బోనాలను తీసుకువచ్చారు. అనంతరం కళాశాల ప్రాంగణంలోనే విద్యార్థులు స్వయంగా బోనాలను తయారు చేసి, సంప్రదాయబద్ధంగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనాలను సమర్పించారు. విద్యార్థుల భాగస్వామ్యంతో కళాశాల ప్రాంగణం భక్తి, ఉత్సాహంతో సందడిగా మారింది. కింగ్‌స్టన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో మైసమ్మ అమ్మవారిని ప్రతిష్ఠించి గత 25 సంవత్సరాలుగా పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని నిర్వాహకులు తెలిపారు. ప్రతి సంవత్సరం బోనాల పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తూ విద్యార్థుల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన, గౌరవాన్ని పెంపొందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులే స్వయంగా బోనాలను తయారు చేయడం ద్వారా "మన సంస్కృతి-మన బాధ్యత" అనే భావనను వారిలో పెంపొందిస్తున్నామని అధ్యాపకులు తెలిపారు. పండుగల వెనుక ఉన్న సాంస్కృతిక, సామాజిక, ఆధ్యాత్మిక విలువలను తెలుసుకోవడంతో పాటు, వాటిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యతను విద్యార్థుల్లో పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. టీచర్ ఎడ్యుకేషన్‌లో సంస్కృతి-విలువలకు ప్రాధాన్యం. టీచర్ ఎడ్యుకేషన్ కరిక్యులమ్‌లో భాగంగా ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా కాబోయే ఉపాధ్యాయుల్లో మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు, మానవీయ విలువల పట్ల అవగాహన పెంపొందుతుందని అధ్యాపకులు తెలిపారు. నేటి విద్యార్థులే రేపటి ఉపాధ్యాయులుగా మారి భావి తరాలను తీర్చిదిద్దే బాధ్యతను స్వీకరించనున్న నేపథ్యంలో, వారికి పాఠ్యాంశాలతో పాటు సంస్కృతి, విలువలు, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమన్నారు. "సంప్రదాయాలను తెలుసుకున్న ఉపాధ్యాయులే విలువలతో కూడిన విద్యను అందించగలరు. విలువలతో కూడిన విద్య ద్వారానే ఉత్తమ భావి భారత పౌరులను తీర్చిదిద్దగలం" అని ప్రిన్సిపాల్ అనంత రెడ్డి తెలిపారు. బోనాల వంటి తెలంగాణ పండుగలను విద్యా కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించడం ద్వారా కాబోయే ఉపాధ్యాయులు స్వయంగా సంప్రదాయాలను అనుభవించి, వాటి గొప్పతనాన్ని భావి తరాలకు పరిచయం చేసే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా "మన సంస్కృతి-మన సంప్రదాయం-మన బాధ్యత" అనే సందేశాన్ని విద్యార్థులకు అందించడంతో పాటు, తెలంగాణ సంస్కృతి, వారసత్వాన్ని భావి తరాలకు అందించే బాధ్యతను కాబోయే ఉపాధ్యాయుల్లో పెంపొందించామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కింగ్‌స్టన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ అనంత రెడ్డి, సీనియర్ అధ్యాపకులు జైపాల్ రెడ్డి, మహేందర్, మనోహర్, నగేష్, శ్రీనివాస్ రెడ్డి, లైబ్రేరియన్ విజయ, అటెండర్ హేమలత, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. బోనాల వేడుకల్లో విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పారు. భక్తిశ్రద్ధలు, సంప్రదాయాలు, విద్యా విలువల సమ్మేళనంగా ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది.

# యాదాద్రి దేవాలయ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా...

## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య






**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 11, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు, ఉద్యోగ భద్రత, సంక్షేమానికి సంబంధించిన పలు కీలక డిమాండ్లపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ నూతన కార్యవర్గ సమావేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. తమ సమస్యలను పరిష్కరించి, ఉద్యోగుల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల ప్రతినిధులు వివరించిన సమస్యలను ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సానుకూలంగా విని, యాదాద్రి దేవాలయ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. యాదాద్రి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సమావేశంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్లను బోర్డు దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంబంధించిన ప్రక్రియను వెంటనే ప్రారంభించి, 15 రోజుల వ్యవధిలో సమస్యల పరిష్కారంలో స్పష్టమైన పురోగతి సాధించేలా ప్రత్యేక చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హామీ ఇచ్చారు. ఉద్యోగుల సంక్షేమం పట్ల ఎమ్మెల్యే చూపిన సానుకూల స్పందన పట్ల యాదాద్రి దేవాలయ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఎమ్మెల్యే తీసుకునే చర్యలకు తమ సంపూర్ణ సహకారం అందిస్తామని పేర్కొన్నారు. యాదాద్రి దేవస్థానంలో సేవలందిస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ, ఉద్యోగులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య స్పష్టం చేశారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

## ఆర్జి-1 ఏరియా జీఎం డి. లలిత్ కుమార్



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 11, రామగుండం, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆర్జి-1 ఏరియా జనరల్ మేనేజర్ డి.లలిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ నెల ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని, రామగుండం ఏరియా-1 ఆధ్వర్యంలో జీఎం కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించనున్న జాతీయ జెండా ఆవిష్కరణ, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్తమ ఉద్యోగుల సన్మాన కార్యక్రమాలకు చేపట్టవలసిన ఏర్పాట్లపై జీఎం డి.లలిత్ కుమార్ అన్ని విభాగాల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వేడుకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే అధికారులు, ఉద్యోగులు,కార్మికులు,వారి కుటుంబ సభ్యులు మరియు ఇతర అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వేడుకల ప్రాంగణంలో వర్షం నుంచి రక్షణ కల్పించే విధంగా షామియానాలు,సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, అతిథులు,ఉద్యోగులు, మహిళలు,వృద్ధులు తదితరులకు అనుకూలంగా ప్రత్యేకంగా సీటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈసారి వేడుకల్లో ప్రత్యేకంగా సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేయాలని,స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు వచ్చే ప్రతి ఒక్కరూ జాతీయ స్ఫూర్తిని ప్రతిబింబించేలా ఫొటోలు తీసుకునే అవకాశం కల్పించాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో వినియోగించేందుకు జనరేటర్‌ను సిద్ధంగా ఉంచాలని ఎలక్ట్రికల్ విభాగం అధికారులను ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే వేదిక,సౌండ్ సిస్టమ్,లైటింగ్,జాతీయ జెండా ఆవిష్కరణ ప్రాంతం తదితర ఏర్పాట్లను ముందుగానే పరిశీలించి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి వచ్చే అతిథులకు తాగునీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు. సివిల్,ఎలక్ట్రికల్,పర్సనల్, సేఫ్టీ,హెల్త్,సెక్యూరిటీ,తదితర అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి, తమకు కేటాయించిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జీఎం లలిత్ కుమార్ సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు రామగుండం ఏరియా-1 ప్రతిష్టను ప్రతిబింబించేలా క్రమశిక్షణతో, వైభవంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని ఆయన కోరారు. ఈ సమీక్షా సమావేశంలో ఎస్ఓటు జీఎం చంద్రశేఖర్,ఏరియా ఇంజనీర్ రాజాజీ,ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి,అధికారులు జితేందర్ సింగ్,రమేష్ డేవిడ్,కర్ణ,ప్రతాప్ గిరిరాజు,హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కారం పద్మ వేణు,శ్రావణ్ కుమార్, హనుమంతరావు,రాజేష్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# రాజపేట ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా విద్యాశాఖాధికారి





హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 11, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం భిక్షపతి రాజపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం రోజు మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న విద్యా కార్యక్రమాలను పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను నేరుగా పరీక్షించారు. విద్యార్థులను వివిధ అంశాలపై ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. తదనంతరం ఉపాధ్యాయుల టీచింగ్ డైరీ లను, వారు రాసిన పీరియడ్ ప్రణాళికలను పరిశీలించారు. వాటితో పాటు విద్యార్థులు రాసిన పరీక్షా పత్రాలను పరిశీలించి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తగిన సూచనలు అందించారు. విద్యార్థుల (ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్) ద్వారా విద్యార్థుల హాజరును , మధ్యాహ్న బోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం పక్కనే ఉన్న బాలికల ఉన్నత పాఠశాలను కూడా సందర్శించి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ప్రత్యేక సూచనలు ఇచ్చారు. పాఠశాలల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం పాఠశాలల బలోపేతానికి అందరూ కృషి చేయాలని, నాణ్యమైన విద్య అందించాలని, ఉత్తమ ఫలితాల కోసం తగిన ప్రణాళికలతో ముందుకు వెళ్ళాలని, ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రజలకు నమ్మకం కలిగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు టి. రాజు, శ్రీమతి కిరణ్మయి మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పలు బాధిత కుటుంబాలను పరామర్శించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 11, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : ఆలేరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పరామర్శించి, వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆలేరు మండలం కొలనుపాక గ్రామం, బైరంనగర్, యాదగిరిగుట్ట మండలం ధర్మారెడ్డిగూడెం, మాసాయిపేట గ్రామాలు, బొమ్మలరామారం మండలం సోలిపేట గ్రామంలో పలు బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి, వారి ఆరోగ్య పరిస్థితి, కుటుంబ పరిస్థితులు, ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, కష్టకాలంలో ప్రభుత్వం మరియు తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాలు ధైర్యంగా ఉండాలని, ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. అవసరమైన సందర్భాల్లో ఆయా కుటుంబాలను ఆదుకునేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కంటోన్మెంట్ 8 వార్డులో అమ్మ వారి పలారం బండి ఊరేగింపు

## ముఖ్య అతిథిగా కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదా మల్లికార్జున్




హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 11, బొల్లారం, బోనాల పండుగ వేడుకలను పురస్కరించుకుని కంటోన్మెంట్ బోర్డ్ పరిధిలోని 8 వార్డులో గల వివిధ అమ్మవారి ఆలయాలలో నిర్వహించిన బోనాల వేడుకలను మరియు అమ్మవారి పలారం బండ్లను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన కంటోన్మెంట్ బోర్డ్ నామినేటెడ్ మెంబర్ బానుక నర్మద మల్లికార్జున్. ఈ కార్యక్రమంలో మహంకాళి జిల్లా ఉపాధ్యక్షులు బి.ఎన్ శ్రీనివాస్ మరియు స్థానిక నాయకులు, భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో మార్నింగ్ వాక్ ద్వారా ప్రజల సమస్యలను స్వీకరించాలి

**సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాలి : ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 11, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ప్రతిరోజూ మార్నింగ్ వాక్ నిర్వహిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా క్షేత్రస్థాయిలో కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాల్లో సర్పంచులు, బీఎల్ఏలు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అలాగే మున్సిపాలిటీల్లో వార్డు కౌన్సిలర్లు, బీఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో మమేకమై మార్నింగ్ వాక్ నిర్వహించాలని తెలిపారు. మార్నింగ్ వాక్



సందర్భంగా ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా పథకాలకు అర్హులైన నిజమైన లబ్ధిదారులను గుర్తించి, వారికి సంబంధించిన సమాచారాన్ని క్షేత్రస్థాయిల క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, గుర్తించిన వివరాలను సంబంధిత గ్రామ సెక్రటరీలకు, వార్డు అధికారులకు, మండల కేంద్రాల్లోని ఎంపీడీవోలకు అందించాలని బీర్ల ఐలయ్య సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి పథకాలు అందేలా స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. "ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం, అర్హులను గుర్తించడం, ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా చూడడం మనందరి బాధ్యత" అని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పేర్కొన్నారు.

# ఆర్.సి.ఒ.ఏ క్లబ్‌లో ఆకట్టుకున్న 'సత్యశోధక' నాటిక

**జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి.**

**ఆర్జీ వన్ జీఎం డి.లలిత్ కుమార్**

రామగుండం, ఆగస్టు 11,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :
రామగుండం ఏరియా-1లోని ఆర్ సి ఒ ఏ క్లబ్‌లో మంగళవారం సాయంత్రం సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే జీవిత చరిత్ర,ఆశయాల ఆధారంగా రూపొందించిన 'సత్యశోధక' నాటికను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్జి.1 ఏరియా జనరల్ మేనేజర్ డి.లలిత్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జీఎం డి.లలిత్ కుమార్ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నాటికను వీక్షించారు. సమాజంలో విద్య, సమానత్వం, మహిళా సాధికారత కోసం జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే చేసిన









కృషి చిరస్మరణీయమని, వారి ఆశయాలను నేటి తరానికి తెలియజేయడంలో ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని జీఎం పేర్కొన్నారు. 'సత్యశోధక' నాటికలో పూలే దంపతులు సమాజంలోని అసమానతలు, మూఢనమ్మకాలు,వివక్షకు వ్యతిరేకంగా చేసిన పోరాటం, మహిళలకు విద్య అందించేందుకు చేసిన కృషిని కళాకారులు తమ అద్భుతమైన నటన ద్వారా ప్రదర్శించారు. నాటిక ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి సింగరేణి పాఠశాలల విద్యార్థులు, సింగరేణి ఉద్యోగులు, అధికారులు, ఉద్యోగుల కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై నాటికను ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్ చిలుక శ్రీనివాస్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఏఐటీయూసీ ప్రతినిధి ఇజ్జగిరి రాజు, అధికారుల సంఘం ప్రతినిధి పేరుమాల్ల శ్రీనివాస్, బీసీ సంఘం లైజన్ ఆఫీసర్, సెంట్రల్ ప్రెసిడెంట్ దీటి చంద్రమౌళి, జనరల్ సెక్రటరీ దేవాచారి, ఉపాధ్యక్షులు కోలా మల్లేష్, ఎస్సీ/ఎస్టీ అసోసియేషన్ సభ్యులు పులి మోహన్, జనగామ నర్సయ్య, లింగమూర్తి, అధికారులు, అనిల్ గబాలే, వేణు, శ్రవణ్ కుమార్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# మొదటి అడుగుతో కశ్వికకు అండగా నిలిచిన శ్రీనివాస్ యాదవ్.. మానవత్వానికి తొలి అడుగు

**దోర్నకల్‌లో చిన్నారి వైద్యానికి చేయూత.. రూ.31 వేలకు చేరిన సహాయం**

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 11, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :**
అనారోగ్యంతో వైద్య చికిత్స పొందుతున్న చిన్నారి కశ్వికకు ఆర్థిక అండగా నిలిచేందుకు దోర్నకల్ పట్టణానికి చెందిన డీఎస్ శ్రీనివాస్ యాదవ్ ముందడుగు వేశారు. చిన్నారి వైద్య పరిస్థితి గురించి తెలుసుకున్న ఆయన వెంటనే స్పందించి రూ.500 ఆర్థిక సహాయం అందించారు. కశ్విక కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో అందించిన ఈ తొలి సహాయం, అనంతరం మరికొందరు దాతలు ముందుకు రావడానికి స్ఫూర్తిగా మారింది. శ్రీనివాస్ యాదవ్ అందించిన చేయూతతో ప్రారంభమైన సహాయ కార్యక్రమానికి పలువురు స్పందించి తమకు సాధ్యమైన మొత్తాల్లో ఆర్థిక సహాయం అందించారు. దీంతో చిన్నారి కశ్విక వైద్య ఖర్చుల కోసం ఇప్పటివరకు సమకూరిన మొత్తం రూ.31 వేలకు చేరింది. చిన్నారి చికిత్సకు అవసరమైన మొత్తం పెద్దదే అయినప్పటికీ, ఒక్కొక్కరి సహాయం కలిసినప్పుడు అది కుటుంబానికి గణనీయమైన భరోసాగా మారుతోంది. ఈ సందర్భంగా డీఎస్ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, కశ్విక అనారోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్న వెంటనే తనవంతుగా సహాయం అందించానని తెలిపారు. తాను చేసిన సహాయం చిన్నదైనా, కష్టాల్లో ఉన్న కుటుంబానికి కొంతైనా తోడుగా ఉండాలనే ఉద్దేశంతోనే ముందుకు వచ్చానన్నారు. చిన్నారి వైద్యానికి ఇంకా ఆర్థిక సహాయం అవసరమున్నందున దాతలు, మానవతావాదులు స్పందించి తమకు సాధ్యమైనంత సాయం అందించాలని కోరారు. కశ్విక చికిత్స కోసం అందుతున్న ప్రతి రూపాయి కుటుంబానికి ఒక ఆశాకిరణంగా మారుతోందని పలువురు పేర్కొన్నారు. డీఎస్ శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించిన ఈ సహాయ కార్యక్రమం మరింత విస్తరించి, చిన్నారి వైద్యానికి అవసరమైన ఆర్థిక సహాయం సమకూరేలా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా స్పందించాలని కోరుతున్నారు. ఆపదలో ఉన్న చిన్నారి కోసం తొలి





చేయూత అందించిన డీఎస్ శ్రీనివాస్ యాదవ్ చొరవకు కశ్విక కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మానవత్వంతో ముందుకు వచ్చిన ప్రతి దాతకు ధన్యవాదాలు తెలియజేస్తూ, కశ్విక త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.

# పెట్టుబడి పెట్టే ముందు ఆలోచించండి.. మోసపోతే 1930కు కాల్ చేయండి

**రిటైర్డ్ ఉద్యోగులకు సైబర్ నేరాలపై అవగాహన**

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 11, రామగుండం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సురక్షా కా తిరంగా - సైబర్ ఇండిపెండెంట్ తెలంగాణ వైపు" కార్యక్రమంలో భాగంగా ఎన్‌టీపీసీ జ్యోతిక భవన్‌లో రిటైర్డ్ ఉద్యోగులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ లు మాట్లాడుతూ సోషల్ మీడియా,వాట్సాప్,టెలిగ్రామ్ ద్వారా వచ్చే అధిక లాభాల పెట్టుబడి ఆఫర్లను నమ్మి రిటైర్మెంట్ అనంతరం వచ్చిన డబ్బులను పెట్టుబడి పెట్టి మోసపోవద్దని సూచించారు. నకిలీ ట్రేడింగ్ యాప్‌లు, డిజిటల్ అరెస్ట్,కేవైసీ,పెన్షన్,పీఎఫ్,లాటరీలు,లోన్లు, ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు ఇచ్చే పెట్టుబడి సూచనలను నమ్మవద్దని,అధిక లాభాల పేరుతో వెంటనే పెట్టుబడి పెట్టాలని ఒత్తిడి చేసే వారిని నమ్మరాదని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం రిటైర్డ్ ఉద్యోగులతో సైబర్ నేరాల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ





కార్యక్రమంలో ఎస్ఐలు మారుతి,క్రాంతి,హెచ్‌డీఎఫ్‌సీ క్లస్టర్ హెడ్ జోస్ స్టీఫెన్,బ్యాంకు అధికారులు,సైబర్ క్రైమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చేయూత నూతన పెన్షన్ల దరఖాస్తుల స్వీకరణను పరిశీలించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య





హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 11, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి: యాదగిరిగుట్ట తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న చేయూత పథకం ద్వారా అందించనున్న నూతన పెన్షన్ల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య యాదగిరిగుట్ట మున్సిపల్ కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, ఇతర అర్హులైన లబ్ధిదారులతో ఆయన మాట్లాడి వారి సమస్యలు, పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం రోజు నుండి ఉదయం వేళల్లో సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి, చేయూత పథకం ద్వారా నూతన పెన్షన్లకు అర్హులైన వారి దరఖాస్తులను స్వీకరించేందుకు సహకరించాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సూచించారు. అర్హులైన వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు మరియు ఇతర లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# కార్పొరేషన్ లోని సమస్యలపై కమిషనర్ కు వినతి పత్రం

**బిఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ మేకల సమ్మయ్య యాదవ్.**



రామగుండం, ఆగస్టు 11,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :
రామగుండం కార్పొరేషన్ లో ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదని, ప్రతి డివిజన్ ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్న సందర్భంగా నగరపాలక సంస్థ కమిషనర్ జె.అరుణ శ్రీ కి మంగళవారం బిఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ మేకల సమ్మయ్య యాదవ్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజల ఆమోదంతో గెలిచినా కార్పొరేటర్ లుగా ప్రజా సమస్యలు తెలపడం కోసం గెలిచి ఆరు నెలలు గడుస్తున్నా రెండో కౌన్సిల్ సమావేశం నిర్వహించక పోవటం దేనికి సంకేతం అని, తక్షణమే కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చెయ్యాలని, ఈ సమావేశం ద్వారా ప్రజా సమస్యలకు పరిష్కార వేదికగా ఉంటుందని, గత కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్ లు తెలిపిన సమస్యలు ఎంత వరకు పరిష్కారం అయినాయో ప్రజలకు తెలుస్తుందని, తద్వారా డివిజన్లో పరిష్కారం కానీ సమస్యలపై ప్రజాప్రతినిధులకు ఒక అవగాహన ఉంటుందని బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్ మేకల సమ్మయ్య యాదవ్ ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. వారితో పాటు 6వ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్యామని రమేష్ పాల్గొన్నారు.

# జహీరాబాద్ ప్రమాదంపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర దిగ్భ్రాంతి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 11, మెయిన్ డెస్క్:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని సత్వార్ గ్రామం వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు కూలీలు మృతి చెందడం పట్ల మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉపాధి కోసం ఆటోలో వెళు_న్న కూలీలను ట్యాంకర్ ఢీకొట్టిన ఈ ఘటన అత్యంత బాధాకరం అన్నారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కర్ణాటకలోని రాజగిరికి చెందిన కూలీల కుటుంబాలకు ఆయన తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారికి ప్రభుత్వం తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని హరీశ్ రావు కోరారు. పొట్టకూటి కోసం వచ్చి ప్రాణాలు కోల్పోయిన ఆ నిరుపేద కూలీల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆదుకోవాలని, తక్షణమే ఎక్స్ గ్రేషియా ప్రకటించి వారికి అండగా నిలవాలని ఆయన కోరారు.

## సంగారెడ్డి జిల్లా రోడ్డు ప్రమాదంపై సీఎం దిగ్భ్రాంతి.. అధికారులకు కీలక ఆదేశాలు



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 11, తెలంగాణ బ్యూరో: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండల పరిధిలోని సత్వార్ గ్రామ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మొత్తం ఏడుగురు కూలీలు దర్మరణం పాలయ్యారు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలు కాగా హుటాహుటిన జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అందులో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తోంది. అయితే, ఈ క్రమంలోనే జరిగిన రోడ్డు ప్రమాదంపై తాజాగా సీఎం రేవంత్ రెడ్డి రెస్పాండ్ అయ్యారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. దుర్ఘటనలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

## మల్లాపూర్ గ్రామంలో ఘనంగా బోనాల పండుగ సంబరాలు

**గ్రామ సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా తొట్టల కార్యక్రమం**

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న కొత్తూరు మాజీ ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి**



హైదరాబాద్ పల్స్ ఆగస్టు 11 షాద్నగర్ ప్రతినిధి : కొత్తూరు మండలంలోని మల్లాపూర్ గ్రామంలో బోనాల పండుగ సంబరాలు స్థానిక సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ధూమ్ ధామ్ గా జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొత్తూరు మండలం తాజా మాజీ ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ గ్రామపంచాయతీ ప్రజలు ఎల్లప్పుడూ సుభిక్షంగా ఉండాలని అమ్మవారి కరుణ కటాక్షాలు వారిపై ఎల్లప్పుడూ విరజిల్లాలని తెలిపారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.తద్వారా సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి అమ్మవారికి గుమ్మడికాయ మరి కొబ్బరికాయ కొట్టి తొట్టల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు యువకులు సర్పంచ్లు మరియు మహిళలు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా తయారీకి ఉపయోగించే నల్ల బెల్లం..పటిక పట్టివేత



హైదరాబాద్ పల్స్, ఆగస్టు 11, నర్సింహులపేట, మండల కేంద్రంలోని ఓ సూపర్ మార్కెట్లో గుడుంబా తయారీకి ఉపయోగించే నల్ల బెల్లం, పటిక అక్రమంగా విక్రయిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. సమాచారం మేరకు గ్రామంలోని సదరు సూపర్ మార్కెట్ను తనిఖీ చేయగా గుడుంబా తయారీకి వినియోగించే నల్లబెల్లం, చక్కెర, ఈస్ట్ పొడి అక్రమంగా విక్రయిస్తున్నట్లు గుర్తించారు.తనిఖీల్లో 200 కిలోల నల్లబెల్లం, 100 కిలోల చక్కెర, 12 కిలోల ఈస్ట్ పొడి లభించడంతో వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముడిసరుకులను మండలంలోని సమీప తండాలకు గుడుంబా తయారీ కోసం విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి సూపర్ మార్కెట్ యజమాని జాటోత్ నరేష్, శంకర్ కుమారుడి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ దాడుల్లో ఎన్. శంకర్ ఎస్ఐ, మధు హెచ్సీ, కానిస్టేబుళ్లు ప్రభాకర్, వెంకటస్వామి పాల్గొన్నారు. గుడుంబా తయారీకి ముడిసరుకుల సరఫరా, అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# ఘోర రోడ్డు ప్రమాదం.. చీకట్లో కలిసిన 9 మంది ప్రాణాలు..




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 11, మెయిన్ డెస్క్ :** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ సమీపంలో జాతీయ రహదారిపై వరుసగా చోటుచేసుకున్న రెండు వేర్వేరు భయానక ప్రమాదాలు తొమ్మిది మంది ప్రాణాలను బలిగొన్నాయి. కూలీలతో వెళ్తున్న ఆటోను వేగంగా వచ్చిన ట్యాంకర్ బలంగా ఢీకొట్టడంతో ఏడుగురు అక్కడికక్కడే కన్నుమూశారు. ఈ దారుణం జరిగిన కొన్ని క్షణాల్లోనే అదే రహదారిపై మూడు కార్లు వరుసగా ఢీకొనడంతో మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. నిమిషాల వ్యవధిలోనే ప్రశాంతంగా ఉన్న రహదారి మృతదేహాలతో, క్షతగాత్రుల ఆర్తనాదాలతో రక్తాసిక్తంగా మారింది.

**కూలీల కుటుంబాల్లో చీకట్లు: ట్యాంకర్ ధాటికి ఏడుగురు మృతి**

జహీరాబాద్ మండలం సత్వార్ సరిహద్దుల వద్ద ఈ మొదటి విషాదం చోటుచేసుకుంది. కర్ణాటకలోని బీదర్ జిల్లా రాజగిరి గ్రామానికి చెందిన 14 మంది వ్యవసాయ కూలీలు నిత్యంలాగే పొలం పనుల కోసం ఆటోలో జహీరాబాద్ పరిసర ప్రాంతాలకు బయలుదేరారు. మార్గమధ్యంలో వేగంగా వచ్చిన ట్యాంకర్ ఆటోను ఢీకొనడంతో ఆటో పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. ఈ ఘటనలో ఏడుగురు కూలీలు దారుణంగా ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే స్పందించి బాధితులను జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

**అదే హైవేపై మరో విషాదం: కార్లు వరుసగా ఢీకొని ఇద్దరు మృతి**

ఆటో ప్రమాద కలకలం రేగుతుండగానే, అదే జాతీయ రహదారిపై మరో ఘోరం జరిగింది. అదుపుతప్పిన మూడు కార్లు ఒకదానినొకటి వరుసగా ఢీకొన్నాయి. ఈ రెండో ప్రమాదంలో మరో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. ఇందులో తీవ్రంగా గాయపడిన మరో ముగ్గురి పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో వారిని ఆసుపత్రిలోని అత్యవసర విభాగానికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఒకే రహదారిపై స్వల్ప వ్యవధిలో 9 మంది మృతి చెందడంతో ప్రాంతమంతా తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# 70ఏళ్ల చరిత్ర గల సంఘం : టీయూడబ్ల్యూజే - (ఐజేయు) ది

- **అక్రిడేషన్లు, బస్సుపాస్ లు ఇప్పించిన ఘనత టీయూడబ్ల్యూజే-ఐజేయు ది.**
- **క్రమశిక్షణ గల సంఘం మనది.**
- **ఐజేయూ జాతీయ సమావేశంలో సంగారెడ్డి జిల్లాకు మంచి పేరు.**





**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 11 :** పటాన్ చెరు జెర్నలిస్టుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం అందరం కలిసి కట్టుగా సంఘటితంగా పనిచేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్టు-ఐజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఏ ఫైజల్ అన్నారు. పటాన్చెరు నియోజకవర్గం టియుడబ్ల్యూజే - ఐజేయు విస్తృత స్థాయి సమావేశాన్ని రామచంద్రాపురం లోని లక్ష్మీ గార్డెన్ లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఉపాధ్యక్షులు ఫైజల్ మాట్లాడుతూ 70ఏళ్ల చరిత్ర ఉన్న యూనియన్ టీయూడబ్ల్యూజే--ఐజేయూ లో క్రమశిక్షణకు మారుపేరులాంటిందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు బస్సు పాస్ సౌకర్యం కల్పించడంలో టీయూడబ్ల్యూజే--ఐజేయూ పాత్ర మరవలేనిదని చెప్పారు. జిల్లాలో అర్హులైన ప్రతీ జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డులను ఇప్పించడం జరుగుతుందని అన్నారు. జర్నలిస్టుల అరోగ్య భద్రత, హక్కుల పరిరక్షణకు పాటుపడుతుందన్నారు.నియమనిబంధనలతో సంఘం పనిచేస్తుందని చెప్పారు. సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ మన సంఘంలో ప్రతి జర్నలిస్టుకు గౌరవం దక్కుతుందన్నారు. జర్నలిస్టుల గౌరవం, భద్రత, హక్కుల విషయంలో అవసరమైనప్పుడు సంఘటితంగా గొంతెత్తాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ మాట్లాడుతూ పటాన్ చెరు జర్నలిస్టుల సమిష్టి కృషితోనే అంచలంచలుగా జిల్లా స్థాయికి ఎదిగానని చెప్పారు.ఇక్కడి జర్నలిస్టులకు రుణపడి ఉంటానంటూ సభావేదిక ద్వారా పాదాబివందనం చేస్తున్నట్లు తెలిపారు. సంఘం బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు. టీయూడబ్ల్యూజే-ఐజేయూ ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి చెన్న బసవేశ్వర్ అధ్యక్షత వహించిన సమావేశంలో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు ఆసీఫ్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాథ్, జిల్లా జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా జాయింట్ సెక్రటరీ భూపాల్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్, ఈసీ మెంబర్లు మజీద్, శ్రీనివాస్, ఫోటో గ్రాఫర్ జిల్లా అధ్యక్షుడు ఆరీఫ్, చిన్న, మధ్య తరహా పేపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్ధిఖ్, జనరల్ సెక్రటరీ ఈశ్వర్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పటాన్చెరు నియోజకవర్గం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

**పటాన్ చెరు అసెంబ్లీ టీయూడబ్ల్యూజే-ఐజేయూ నూతన కార్యవర్గం:**

నూతన అధ్యక్షునిగా పత్తి నర్సింహా, ప్రధానకార్యదర్శిగా యాదగిరి, సలహాదారులుగా కాశీపతి, సులేమాన్, రామారావు, ఉపాధ్యక్షులు గా విఠల్, నగేష్, శివకుమార్, జెమిని రాజు, రమేష్, జీవరత్నం, జాయింట్ సెక్రటరీలుగా వేణు, ప్రభాకర్, శ్రీనివాస్, కోటేష్, శివాజీ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఆంజనేయులు, గాండ్ల మహేష్, వివేక్, రాజు, కోశాధికారిగా శ్రీనివాస్ రెడ్డి, ఈసీ మెంబర్లు గా శ్రీనివాస్, శంకర్, శేఖర్, మహేందర్ గౌడ్, సిద్ధు, శ్రీనివాస్ మామా, రాజశేఖర్, ప్రదీప్ రెడ్డి, విజయ్, నాయుడు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరికి రాష్ట్ర, జిల్లా నాయకులు, తోటి జర్నలిస్టులు శుభాకాంక్షలు తెలిపి అభినందనలు తెలిపారు

### రివర్స్ ఎటాక్.. జార్ఖండ్ నిరసనలపై రాహుల్

# సమాధానం చెప్పాలి.. ఎన్డీయే ఎంపీల నిరసన

**విద్యార్థుల నిరసలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.. చర్చ నుంచి రాహుల్ పారిపోతున్నారు : ఎన్డీయే ఎంపీలు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 11, సెంట్రల్ డెస్క్ :**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మరింత వేడి రాజుకుంది. నీట్ పేపర్ లీక్, విద్యార్థులపై పోలీసుల లాఠీఛార్జ్, రామమందిరం విరాళాల చోరీ అంశంపై పార్లమెంట్ ఆవరణలోని మకర ద్వారం వద్ద ప్రతిపక్ష ఎంపీలు నిరసన తెలుపుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఎన్డీయే ఎంపీలు సైతం ప్రతిపక్షాల చర్యలను నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. విపక్షాలకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. సమావేశాలను సజావుగా సాగనీకుండా విపక్ష ఎంపీలు అడ్డుకుంటున్నారంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అదే సమయంలో విపక్ష ఎంపీలు సైతం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అధికార, ప్రతిపక్ష ఎంపీల పోటాపోటీ నినాదాలతో పార్లమెంట్ ఆవరణలో కాస్త ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది.

**రాహుల్.. జార్ఖండ్ వెళ్లండి:**

బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశం 'మంగళ్ మిలన్' ఇవాళ ఉదయం పార్లమెంట్ లైబ్రరీ భవనంలోని జీఎంసీ బాలయోగి ఆడిటోరియంలో జరిగింది. ఈ సమావేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, కేంద్ర మంత్రి జేపీ నడ్డా, ఇతర ఎన్డీయే కూటమి ఎంపీలు హాజరయ్యారు. సమావేశం అనంతరం ఎంపీలంతా పార్లమెంట్లో కొనసాగుతున్న ప్రతిష్టంభనకు నిరసనగా పార్లమెంట్వైపు కవాతు నిర్వహించారు. విద్యార్థుల నిరసనలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సభలో సమాధానం ఇచ్చేందుకు అమిత్ షా సిద్ధంగా ఉన్నారని, అయితే ప్రతిపక్షం పార్లమెంటులో చర్చను తప్పించుకుంటోందని పేర్కొంటూ ఎన్డీయే ఎంపీలు ప్లకార్డులు చేతబూని ప్రతిపక్షానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ చర్చ నుంచి ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పారిపోతున్నారని ఆరోపించారు.ముఖ్యంగా జార్ఖండ్ రాంచీలో విద్యార్థుల నిరసనలపై ఎన్డీయే ఎంపీలు రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రాహుల్ జీ.. జార్ఖండ్కు వెళ్లండి అంటూ నినదించారు. అదే సమయంలో కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ అక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ ముఖేష్ దలాల్ రాహుల్కు వ్యతిరేకంగా తన నినాదాలను కొనసాగించారు. స్పందించిన ప్రియాంక.. రాహుల్ ఇప్పటికే జార్ఖండ్లో నిరసన చేస్తున్న విద్యార్థులను కలిశారని బదులిచ్చారు.ఇక విపక్ష ఎంపీలు అయోధ్య రామ మందిరం విరాళాల చోరీపై పార్లమెంట్ ఆవరణలో తమ నిరసనలను కొనసాగించారు. విద్యార్థులపై పోలీసుల లాఠీఛార్జ్, పెల్లెట్ గన్స్ అంశంపై అమిత్ షా సభకు వచ్చి మాట్లాడాలని డిమాండ్ చేశారు. పోటాపోటీ నినాదాలతో పార్లమెంట్ ఆవరణలో గందరగోళ వాతావరణం నెలకొంది.



# సత్వార్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం.. విచారం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే మాణిక్ రావు

**ట్యాంకర్ ఢీకొని ఏడుగురు వ్యవసాయ కూలీల దుర్మరణం.. మరో ఐదుగురికి తీవ్ర గాయాలు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 11, జహీరాబాద్ ప్రతినిధి:**
జహీరాబాద్ మండలం సత్వార్ గ్రామం వద్ద రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ట్యాంకర్ ఆటోను ఢీకొన్న ఈ ప్రమాదంలో ఏడుగురు మృతి చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాణిక్ రావు వెంటనే స్పందించారు. మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, మాజీ మార్కెట్ చైర్మన్ గుండప్ప, మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, ఝురసంఘం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, కౌన్సిలర్లు, పార్టీ నాయకులతో కలిసి జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాద ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. అవసరమైతే మెరుగైన వైద్యం కోసం ఉన్నత వైద్యసదుపాయాలు కల్పించాలని సూచించారు. అలాగే ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ ఘోర ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఎమ్మెల్యే మాణిక్ రావు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని, వెంటనే ఎక్స్‌గ్రేషియా అందించాలని, గాయపడిన వారికి అవసరమైన మెరుగైన వైద్య సహాయం అందేలా



చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. "సత్వార్ వద్ద జరిగిన ఈ ఘోర రోడ్డు ప్రమాదం తీవ్రంగా కలచివేసింది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను అని ఎమ్మెల్యే మాణిక్ రావు పేర్కొన్నారు.

## జహీరాబాద్‌కు భారీ పెట్టుబడుల జోరు..

# రూ.10 వేల కోట్లు, 1.74 లక్షల ఉద్యోగాలు!

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 11, తెలంగాణ బ్యూరో: తెలంగాణలో పారిశ్రామిక కారిడార్లు, పారిశ్రామిక పార్కుల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, కొత్త పారిశ్రామిక క్లస్టర్ల ఏర్పాటు, పరిశ్రమలకు అందుతున్న ప్రోత్సాహకాలపై ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి లోక్‌సభలో మంగళవారం ప్రశ్నలు అడిగారు. వీటికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయమంత్రి జితిన్ ప్రసాద లిఖితపూర్వక సమాధానమిచ్చారు. జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమం కింద హైదరాబాద్ - నాగ్‌పూర్ పారిశ్రామిక కారిడార్‌లోని జహీరాబాద్ పారిశ్రామిక ప్రాంతం అభివృద్ధికి కేంద్రం ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లాలో 3,245 ఎకరాల్లో రూ.2,361 కోట్లతో ఈ ప్రాజెక్టును




చేపడుతున్నారని.. సుమారు రూ.10,000 కోట్ల పెట్టుబడులు, 1.74 లక్షల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉన్నదని కేంద్రం తెలిపింది. వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు పీఎం మిత్ర పథకం కింద గరిష్ఠంగా రూ.200 కోట్ల అభివృద్ధి మూలధన సహాయం అందనుందని తెలిపారు. అలాగే.. కొత్త పారిశ్రామిక క్లస్టర్ల కోసం రాష్ట్రాలు ప్రతిపాదనలు సమర్పించవచ్చని కేంద్రం తెలిపింది. ఇదే సమాధానంలో ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బుగ్గపాడులో 60 ఎకరాల్లో మెగా ఫుడ్ పార్కు ఏర్పాటుకు కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ ఆమోదం తెలిపినట్లు వెల్లడించింది. ప్రాజెక్టు ఆమోదిత వ్యయం రూ.109.59 కోట్లుగా పేర్కొన్నారు. తెలంగాణ నూతన ఎంఎస్ఎంఈ విధానం-2024 కింద పరిశ్రమలకు భూమి రాయితీ, స్టాంప్ డ్యూటీ రీయింబర్స్‌మెంట్, పెట్టుబడి సబ్సిడీ, విద్యుత్ ఖర్చు రీయింబర్స్‌మెంట్, ఎస్‌జీఎస్‌టీ రీయింబర్స్‌మెంట్ వంటి ప్రోత్సాహకాలు అందుబాటులో ఉన్నాయని కేంద్రం వివరించింది.

# అమిత్ షా యూటర్న్..!
# 48 గంటల్లో మారిన సీన్-విపక్షానికి కండిషన్లు..!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 11, సెంట్రల్ డెస్క్ :**
నీట్ అక్రమాలపై ఢిల్లీలో విద్యార్థులు చేపట్టిన పార్లమెంట్ మార్చ్ ను అడ్డుకునేందుకు పోలీసులు బలప్రయోగం చేసిన ఘటనపై సమాధానం చెప్పేందుకు పార్లమెంట్ కు రావాలని విపక్షాలు పదే పదే కోరుతున్నా పట్టించుకోకుండా ఉండిపోయిన హోంమంత్రి అమిత్ షా ఎట్టకేలకు అంగీకరించారు. దీంతో అమిత్ షా ఎప్పుడొస్తారని ఇవాళ కూడా విపక్షాలు కేంద్రాన్ని ప్రశ్నించాయి. అయితే పార్లమెంట్ కు రావడానికి బేషరతుగానే అంగీకరించిన అమిత్ షా 48 గంటల్లోనే యూటర్న్ తీసుకుని విపక్షానికి షరతులు పెట్టారు. పార్లమెంట్ కు వచ్చి ఢిల్లీ విద్యార్ధులపై పోలీసుల బలప్రయోగంపై సమాధానం ఇచ్చేందుకు అంగీకరించిన అమిత్ షా.. నిన్న జార్ఖండ్ లో విద్యార్ధుల నిరసనలు, అంతకు ముందు పంజాబ్ లో జరిగిన నిరసనలపై కూడా చర్చిద్దామంటూ విపక్షానికి షరతు పెట్టారు. తద్వారా తనను టార్గెట్ చేస్తున్న విపక్షాలను .. వారు అధికారంలో ఉన్న పంజాబ్ (ఆప్), జార్ఖండ్ (కాంగ్రెస్-జేఎంఎం)లో నిరసనలపై ఇరుకునపెట్టేందుకు ప్లాన్ చేశారు. దీంతో విపక్షాలు అమిత్ షా షరతుక అంగీకరిస్తాయా, వారు అంగీకరించకపోతే అదే కారణం చూపి మరో రెండు రోజుల్లో ముగియనున్న పార్లమెంట్ సమావేశాలకు ఆయన రాకుండా ఉండిపోతారా అన్న చర్చ జరుగుతోంది. అమిత్ షా స్పందించే ముందు ఈ అంశంపై సమగ్ర చర్చ జరగాలని ప్రభుత్వం ప్రతిపక్షానికి తెలిపింది. కేవలం ఒక ప్రకటన చేయడం అనేది ఒక లాంఛనప్రాయమైన చర్య మాత్రమే అవుతుందని, తమకు కావాల్సింది కేవలం ప్రకటన కాదని, సమగ్ర చర్చ అని ప్రభుత్వ వర్గాలు ఇవాళ పేర్కొన్నాయి. మరోవైపు ఇప్పటికే కల్పిత చర్చల పట్ల తనకు ఆసక్తి లేదని విపక్ష నేత రాహుల్ గాంధీ కూడా పేర్కొన్నారు. నేరుగా జూలై 20న విద్యార్థులపై



కాల్పులు జరపాలని ఎవరు ఆదేశించారో పార్లమెంటుకు తెలియజేయాలని హోం మంత్రిని ప్రత్యేకంగా కోరారు. అమిత్ షా వచ్చి పార్లమెంటులో ప్రసంగిస్తారా అనేది అసలు ప్రశ్న కాదు. ఢిల్లీలో కాల్పులకు ఎవరు అనుమతి ఇచ్చారో అమిత్ షా స్పష్టం చేయాలన్నదే అసలు ప్రశ్న అని రాహుల్ స్పష్టం చేశారు. దీన్ని బట్టి చూస్తుంటే అమిత్ షా రావడం, విపక్షం కోరుతున్నట్లుగా సమాధానం చెప్పడం సాధ్యం కాదని తేలిపోతోంది.

# జీవో 641 రద్దు చేసే వరకు పోరాటం ఆగదు

### డబ్బులు, పదవులతో జేఏసీని కొనలేరు..
### ప్రభుత్వాన్ని మరియు అధికారులను నిలదీసిన జేఏసీ కో కన్వీనర్ బిచ్యా నాయక్

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 11, సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో జేఏసీ కో-కన్వీనర్ బిచ్యా నాయక్ ప్రభుత్వం, అధికారులను తీవ్రంగా విమర్శించారు. డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకుని జీవో 641ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్‌కు సమీపంలోనే సుమారు 400 మంది గిరిజన విద్యార్థులు చదువుతున్న గిరిజన గురుకులం ఉందని, విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును పరిగణనలోకి తీసుకోకుండా డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం ఎలా సమంజసమని ప్రశ్నించారు. ఇంత మంది గిరిజన విద్యార్థుల భవిష్యత్తు కంటే డంపింగ్ యార్డ్ గొప్పదా? అని ప్రభుత్వాన్ని సూటిగా నిలదీశారు. అలాగే వందల సంవత్సరాల చరిత్ర కలిగిన పవిత్ర జాంగిర్ పీర్ దర్గా సమీపంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం ప్రజల విశ్వాసాలను, ఆధ్యాత్మిక ప్రదేశాల పవిత్రతను దెబ్బతీసే చర్యగా అభివర్ణించారు. ఎమ్మెల్యే ప్రజల పక్షాన నిలబడి డంపింగ్ యార్డ్ సమస్యపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలని బిచ్యా నాయక్ కోరారు. అధికారులు ఫైళ్లలో సర్వే నంబర్లు మాత్రమే చూడకుండా, ఆ భూములపై ఆధారపడి జీవిస్తున్న రైతుల జీవితాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. జేఏసీని కొనలేరు జేఏసీని డబ్బులు, పదవులతో కొనుగోలు చేయలేరని బిచ్యా నాయక్ స్పష్టం చేశారు. ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర జేఏసీకి ఉందని పేర్కొన్నారు. జేఏసీ చైర్మన్ గతంలో లగచర్ల ఉద్యమంతో పాటు మా రాజ్యం-మా హక్కు వంటి ప్రజా ఉద్యమాల్లో పోరాడిన వ్యక్తి అని గుర్తుచేశారు. మాకు పదవులు ముఖ్యం కాదు.. ప్రజల భూములు, ప్రజల ఆరోగ్యం, మా పిల్లల భవిష్యత్తే ముఖ్యం. జీవో 641 రద్దు అయ్యే వరకు జేఏసీ పోరాటం ఆగదు అని ఆయన స్పష్టం చేశారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించి డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని, లేకపోతే ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అధికారం మీది కావచ్చు.. కానీ ఈ నేల మాది. జీవో మీది కావచ్చు.. కానీ మా భవిష్యత్తు మా పిల్లలది అని బిచ్యా నాయక్ పేర్కొన్నారు.




## కుత్బుల్లాపూర్లో కళాకారుల బోనాల జాతర
## వందలాది మంది కళాకారులతో ప్రదర్శన



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 11, కుత్బుల్లాపూర్ ప్రతినిధి : నియోజకవర్గంలోని గాజులరామారంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సభ్యులు దరువు అంజన్న,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జిల్లా కాంగ్రెస్ సాంస్కృతిక శాఖ అధ్యక్షులు దుడ్డు రాహుల్ వారి ఆధ్వర్యంలో వందలాది కళాకారులతో ప్రదర్శన నిర్వహించారు. బోనాల జాతర సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. వందలాది మంది కళాకారులు పాల్గొనడంతో జాతర ప్రాంగణం సందడిగా మారింది. స్కూల్ విద్యార్థుల నృత్యాలు, దరువులు, డప్పుల మోత, కోలాటాలు, పోతరాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బోనాలు, ఆటపాటలతో జాతర ప్రాంగణం కిటకిటలాడింది. కళాకారుల ప్రదర్శనలను చూసేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సంప్రదాయ కళారూపాలు, భక్తి పాటలతో పండుగ వాతావరణం నెలకొంది. చిన్నారుల నృత్యాలు, పోతరాజుల విన్యాసాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ సంస్కృత సలహాదారులు దరువు అంజన్న,దరువు ఎల్లన్న, అంతడుపుల నాగరాజు,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ పై విద్యార్థులకు అవగాహన

**పెద్దపల్లి షీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 11, రామగుండం ప్రతినిధి :** రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి షీ టీమ్ ఆధ్వర్యంలో గోదావరిఖని అశోక్‌నగర్ జెడ్పీ.హెచ్.ఎస్ హైస్కూల్ విద్యార్థులకు మహిళలు,బాలల భద్రత,సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ ఇన్‌చార్జి ఎస్ఐ లావణ్య విద్యార్థులకు గుడ్ టచ్,బ్యాడ్ టచ్, పోక్సో చట్టం,సోషల్ మీడియా వినియోగం,సైబర్ మోసాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వేధింపులకు గురైతే భయపడకుండా షీ టీమ్ 6303923700కు సమాచారం అందించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 100/112,సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. మహిళలు ప్రయాణ సమయంలో భద్రత కోసం టీ-భద్రత యాప్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ మల్లేష్,ఉపాధ్యాయులు,షీ టీమ్ సభ్యులు సురేష్,మౌనిక, స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ ఆయా మృతి.. తోటి సిబ్బంది ఆర్థిక సహాయం



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 11, నర్సింహులపేట, మరిపెడ ప్రాజెక్టు కౌంసల్యాదేవిపల్లి సెక్టార్ పరిధిలోని జయపురం గ్రామం రెండో అంగన్వాడీ కేంద్రంలో ఆయాగా విధులు నిర్వహిస్తున్న చుక్క మంగమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న తోటి అంగన్వాడీ టీచర్లు, ఆయాలు మానవతా దృక్పథంతో మృతురాలి కుటుంబానికి అండగా నిలిచి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన తోటి సిబ్బంది తమ వంతు సహాయంగా రూ.11 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఐసీడీఎస్ కార్యాలయం నుంచి ఏసీడీపీఓ తేజ కల్యాణి, సూపర్‌వైజర్ మంగాదేవి మృతురాలి కుటుంబానికి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులకు వారు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలు సమ్మెట లలిత, కవిత, రమ, భారతమ్మ, యాకమ్మ, మాధవి కౌంసల్యాదేవిపల్లి సెక్టార్ అంగన్వాడీ టీచర్లు కవిత , నీరజ, రంగమ్మ అంగన్వాడీ ఆయాలు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా..గుండెల్లో నింపాలి దేశభక్తి నిండా

### దేశభక్తిని చాటాలన్న నటరాజన్ గౌడ్



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 11, మన దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు, ఆగస్టు 10వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రతి కుటుంబం తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకుందాం.మన త్రివర్ణ పతాకం కేవలం ఒక జెండా కాదు అది మన దేశ గౌరవానికి ప్రతీక అది మన భారతీయుల ఐక్యతకు ప్రతీక అది మన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు ప్రతీక అది ప్రపంచ వేదికపై భారతదేశం సగర్వంగా నిలుస్తున్నదానికి ప్రతీక!ప్రపంచ దేశాలకు సాటిగా భారత్ ప్రగతి పథంలో దూసుకెళ్తున్న ఈ సమయంలో, ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురుతూ ఉండాలి. ప్రతి భారతీయుడి హృదయంలో దేశభక్తి నిండాలి.మన ఇల్లు మన జెండా మన దేశం! ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ప్రతి గుండెలో భారతమాత.ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేసి మన జాతీయ జెండాకు గౌరవం చాటుదామని నటరాజన్ గౌడ్ జై హింద్! భారత్ మాతాకీ జై! పిలుపునిచ్చారు.

## తెలంగాణ మాజీ బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణంను అభినందించిన ప్రధాని నరేంద్ర మోదీ

### బీసీల కోసం చేసిన కృషి గొప్పది అంటూ ప్రశంస



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 11, శేరిలింగంపల్లి, తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్, రచయిత డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు తన సతీమణి సుధాశ్రీతో కలిసి మంగళవారం పార్లమెంట్ భవనంలోని ప్రధానమంత్రి కార్యాలయంలో నరేంద్ర మోదీని కలిశారు. సుమారు పది నిమిషాలపాటు సాగిన భేటీలో తాను రచించిన 'నరేంద్ర మోదీ – భారత్‌ను విశ్వవేదికపై నిలిపిన మహానాయకుడు' తెలుగు––హిందీ––ఇంగ్లీష్ త్రిభాషా గ్రంథం, 'అంత్యోదయం నుండి వికసిత భారత్' తెలుగు గ్రంథం, 'జీఎస్టీ: సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం మరియు వికాస యాత్ర' త్రిభాషా గ్రంథాలను ప్రధానమంత్రికి సమర్పించారు.గ్రంథాలను ఆసక్తిగా పరిశీలించిన ప్రధాని, "ఈ గ్రంథాల రచనలో మీరు యజ్ఞం చేశారు'' అంటూ డాక్టర్ వకుళాభరణంను అభినందించారు. ఆయన వ్యక్తిగత వివరాలు, విద్యార్థి దశ నుండి బీసీ ఉద్యమాల్లో సాగించిన ప్రయాణం, బీసీ కమిషన్లలో సభ్యుడిగా, చైర్మన్‌గా అందించిన సేవలను అడిగి తెలుసుకున్నారు. "బీసీల కోసం మీరు చేసిన కృషి గొప్పది" అని ప్రశంసించారు. అత్యంత చిన్న సామాజిక వర్గం నుండి ప్రజాజీవితంలో డాక్టర్ వకుళాభరణం ఎదిగిన తీరును ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు. "మీ నిబద్ధతను పరిశీలించాను; కలిసి పనిచేద్దాం" అని పేర్కొంటూ, రచనా పరంపరను కొనసాగించాలని సూచించినట్లు డాక్టర్ వకుళాభరణం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు.'జీఎస్టీ: సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం మరియు వికాస యాత్ర' గ్రంథాన్ని 2025 డిసెంబర్ 16న పార్లమెంట్ భవనంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆవిష్కరించగా, మిగిలిన రెండు గ్రంథాలను 2026 జూన్ 28న హైదరాబాద్‌లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఆవిష్కరించిన విషయం తెలిసిందే. ఈ అరుదైన అవకాశం ఇచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, సహకరించిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, తెలంగాణ బీజేపీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీకి డాక్టర్ వకుళాభరణం కృతజ్ఞతలు తెలిపారు.

విలేకరులు కావలెను
హైదరాబాద్ పల్స్
"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాద్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్
- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413
www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad

# పాకిస్థాన్‌కు సౌదీ షాక్.. భారత్‌పై యుద్ధానికి నో!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 11 :**
పాకిస్థాన్, టర్కీ, సౌదీ అరేబియాల మధ్య కుదిరిన మక్కా రక్షణ ఒప్పందం ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఒప్పందంపై ఇజ్రాయెల్ ఆగ్రహంతో ఉండగా.. పాకిస్థానీలు ఆనందంతో ఉన్నారు. "ముస్లిం నాటో"గా పిలవబడుతున్న ఈ రక్షణ ఒప్పందాన్ని సౌదీ అరేబియా నుంచి పాకిస్థాన్ వరకు ఘనంగా జరుపుకుంటున్నారు. ఒకవేళ భారత్ పాకిస్థాన్‌పై దాడి చేస్తే సౌదీ అరేబియా, టర్కీ రెండూ దానికి సహాయం చేస్తాయని పాకిస్థానీలు సంతోషిస్తున్నారు. ఈ రక్షణ ఒప్పందం ప్రకారం ఓ దేశంపై దాడిని మరో దేశంపై దాడిగా పరిగణిస్తారు. మక్కా రక్షణ ఒప్పందం పాకిస్థాన్ దౌత్య స్థానాన్ని గణనీయంగా బలోపేతం చేసిందనడంలో సందేహం లేదని, భవిష్యత్తులో దాని సైనిక బలాన్ని కూడా గణనీయంగా పెంచుతుందని నిపుణులు అంటున్నారు. భారత్ గురించి సౌదీ అరేబియా నిపుణులు ఏమంటున్నారో తెలుసుకుందాం.భారత్, సౌదీ అరేబియాల మధ్య చాలాకాలంగా బలమైన సంబంధాలు ఉన్నాయి. వేలాది మంది భారతీయులు సౌదీ అరేబియాలో పనిచేస్తున్నారు. సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ పలుమార్లు భారత్‌ను సందర్శించారు. మిల్లీ క్రానికల్ నివేదిక ప్రకారం.. పాకిస్థాన్‌తో రక్షణ ఒప్పందం కుదిరినంత మాత్రాన భవిష్యత్తులో భారత్‌తో ఘర్షణ పడటానికి సౌదీ అరేబియా లేదా టర్కీ నుంచి పాకిస్తాన్‌కు పూర్తి స్వేచ్ఛ లభించినట్లు కాదని సౌదీ నిపుణులు అంటున్నారు. సౌదీ అరేబియా నుంచి వచ్చిన ప్రకటనలు చాలా సంయమనంతో కూడుకున్నవి. అంతేకాకుండా, సౌదీ నిపుణులు భారత్ వ్యతిరేక వాదనను తిరస్కరిస్తున్నారు.



**పాకిస్థాన్‌కు షాకిచ్చిన సౌదీ నిపుణుడు:**
మక్కా ఒప్పందాన్ని ఇండియాకు వ్యతిరేకంగా చేసుకున్న దురాక్రమణ ఒప్పందంగా చూడాలన్న వాదనను సౌదీ అరేబియా నిపుణుడు బదూర్ సోషల్ మీడియాలో కొట్టిపారేశారు. "సౌదీ అరేబియాకు భారత్, గ్రీస్‌లతో బలమైన వ్యూహాత్మక స్నేహం ఉంది. ఆపరేషన్ సింధూర్ సమయంలో ఉన్నత స్థాయి దౌత్యం ద్వారా భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలను తగ్గించడంలో సౌదీ అరేబియా కీలక పాత్ర పోషించింది, ఇది తదనంతరం కాల్పుల విరమణకు దోహదపడింది.'' అని పేర్కొన్నారు.మక్కా రక్షణ ఒప్పందం పూర్తిగా రక్షణాత్మకమైనదని, ఏ దేశానికీ వ్యతిరేకంగా నిర్దేశించబడలేదని కూడా బదూర్ పేర్కొన్నారు. అందువల్ల ఇది దాడి చేయడానికి చేసుకున్న ఒప్పందం అనే వాదన అర్థరహితమన్నారు. ఈ మూడు దేశాలలో ఏదైనా ఒకదానిపై శత్రువు దాడి చేస్తేనే ఇది అమల్లోకి వస్తుంది. లేకపోతే ఇది శాంతి, స్థిరత్వాన్ని మాత్రమే ప్రోత్సహిస్తుంది. దీనిని యావత్ ప్రపంచం గుర్తించాలి. బదూర్ ప్రకటన సౌదీ అరేబియా ప్రభుత్వానిది కానప్పటికీ.. సౌదీ అరేబియాలో ఈ ఒప్పందాన్ని కేవలం భారతదేశ వ్యతిరేక ఒప్పందంగా మాత్రమే చూడటం లేదని ఇది చూపిస్తోంది.

**భారత్, సౌదీ అరేబియా మధ్య కూడా రక్షణ ఒప్పందం**
బదూర్ వాదన సౌదీ అరేబియా విదేశాంగ విధానాన్ని కూడా ప్రతిబింబిస్తుంది. సౌదీ అరేబియా భారత్‌తో తన సంబంధాన్ని వేగంగా బలోపేతం చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో సౌదీ అరేబియా ఇండియాతో తన సంబంధాన్ని దెబ్బతీయాలని కోరుకోదు. సౌదీ అరేబియా, భారత్ మధ్య ఈ సంబంధం కేవలం వాణిజ్యపరమైనది మాత్రమే కాదు. 2025లో స్థాపించబడిన వ్యూహాత్మక భాగస్వామ్య మండలి ద్వారా భారత్, సౌదీ అరేబియా మధ్య ఓ రక్షణ ఒప్పందం ఉంది. ఈ ఒప్పందం నేపథ్యంలో భారత నౌకాదళం, సైన్యానికి చెందిన అధికారులు కూడా సౌదీ అరేబియాతో చర్చలు జరిపారు.

**సౌదీ అరేబియా ఇండియాపై బాంబు దాడి చేయబోదు..**
మరో సౌదీ విశ్లేషకుడు ఫైసల్ మాట్లాడుతూ.. ఈ రక్షణ ఒప్పందం అంటే సౌదీ అరేబియా ఇప్పుడు భారతదేశంతో పోరాడటానికి కట్టుబడి ఉందని అర్థం కాదని పేర్కొన్నారు. మక్కా ఒప్పందం ప్రకారం సౌదీ అరేబియా, టర్కీ విమానాలు భారతదేశంపై స్వయంచాలకంగా బాంబు దాడులు చేయవని తెలిపారు. యుద్ధం వస్తే అది ఎవరు ప్రారంభించారు, పరిస్థితి ఏమిటనేది సమీక్షించిన తర్వాతే నిర్ణయం ఉంటుందన్నారు. భారత్ తో ఉన్న వాణిజ్య, వ్యూహాత్మక ప్రయోజనాల దృష్ట్యా.. యుద్ధంలో భాగస్వామి కావడం కంటే.. మధ్యవర్తిత్వం వహించి యుద్ధాన్ని నివారించడమే సౌదీ అరేబియా విధానంగా ఉంటుందని ఆయన తెలిపారు.

### బలూచిస్తాన్ స్వాతంత్ర్య దినోత్సవం

# పాకిస్థాన్ భవిష్యత్తుపై రాయబారి షాకింగ్ కామెంట్స్!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 11:**
భారత్‌కు స్వాతంత్ర్యం రాకముందే.. అంటే 1947 ఆగస్టు 11న బ్రిటీష్ పాలన నుంచి బలూచిస్తాన్ తన స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకుంది. నాటి సరిహద్దుల ప్రకారం పాకిస్తాన్ లేదా బంగ్లాదేశ్ ఉనికిలో లేని సమయంలోనే బలూచిస్తాన్ ఓ స్వతంత్ర ప్రాంతంగా ఉండేది. అయితే 1947 చివరలో పాకిస్తాన్ బలవంతంగా బలూచిస్తాన్‌ను తన దేశంలో విలీనం చేసుకుంది. నాటి నుంచి బలూచిస్తాన్ ప్రజలు తమ స్వయం ప్రతిపత్తి, స్వేచ్ఛ కోసం నిరంతరం పోరాడుతూనే ఉన్నారు.

**పాక్ అణచివేత.. చైనా జోక్యం:**
దశాబ్దాలుగా పాకిస్తాన్ ప్రభుత్వం, సైన్యం బలూచిస్తాన్ ప్రాంతంపై తీవ్రమైన అణచివేత చర్యలకు పాల్పడుతున్నాయి. బలూచిస్తాన్ అపారమైన సహజ సంపదను కలిగి ఉన్నప్పటికీ.. పాకిస్తాన్ దానిని ఓ రెండో తరగతి భూభాగంగానే చూస్తోంది. స్థానిక ప్రజల అనుమతి లేదా భాగస్వామ్యం లేకుండా పెద్ద ఎత్తున చైనా కంపెనీలను పెట్టుబడుల కోసం ఆహ్వానించడం అక్కడ తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. దీంతో పాకిస్తాన్ ప్రభుత్వానికి, చైనా ప్రాజెక్టులకు వ్యతిరేకంగా బలూచిస్తాన్‌లో ప్రజా నిరసనలు కొనసాగుతున్నాయి.

**పాకిస్తాన్‌పై ఆర్థిక దెబ్బ:**
వరల్డ్ పీస్ యునైటెడ్ రాయబారి పర్వీందర్ సింగ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. బలూచిస్తాన్ భూభాగంలో బంగారం, విలువైన రాళ్లు, అరుదైన ఖనిజ వనరులు సమృద్ధిగా ఉన్నాయి. పాకిస్తాన్ తన ఆర్థిక పునాదిలో దాదాపు 75 శాతం ఆదాయాన్ని ఈ ప్రాంతపు వనరులపైనే ఆధారపడి పొందుతోంది. ముఖ్యంగా చైనాతో సహా అనేక దేశాలకు ఖనిజాల ఎగుమతికి ఇది కీలక కేంద్రంగా మారింది. ఒకవేళ బలూచిస్తాన్ విడిపోతే పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కుప్పకూలే ప్రమాదం ఉంది. అందుకే పాకిస్తాన్ బలూచిస్తాన్‌పై నియంత్రణను వదులుకునేందుకు సిద్ధంగా లేదు.

**బలూచిస్తాన్‌కు అంతర్జాతీయ మద్దతు:**



ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 56 కంటే ఎక్కువ దేశాలు బలూచిస్తాన్ స్వాతంత్ర్య పోరాటానికి, వారి ప్రాథమిక హక్కులకు మద్దతు ఇస్తున్నాయి. 21వ శతాబ్దంలో బలప్రయోగం, హింస ద్వారా భూభాగాలను అదుపులో ఉంచడం సాధ్యం కాదని.. బలూచిస్తాన్ ప్రజలకు తమ స్వేచ్ఛను వేడుకగా జరుపుకోవడానికి అనుమతించడమే అంతర్జాతీయ శాంతి దిశగా వేసే సరైన అడుగు అని దౌత్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

## చంద్రుడిపై బేస్ స్టేషన్, అంతరిక్ష పరిశోధన కేంద్రం: నాసా పార్ట్‌నర్ గా ఇస్రో.. !

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 11:**
భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ.. ఇస్రో ఓ నూతన అధ్యాయం వైపు అడుగులు వేస్తోంది. చంద్రుడిపై నిర్మించతలపెట్టిన మూన్ బేస్ మిషన్ లో ఇస్రో భాగస్వామ్యం కాబోతోంది. ఈ మేరకు అమెరికా అంతరిక్ష సంస్థ నాసా నుంచి ఆహ్వానం అందింది. అంతరిక్ష రంగంలో భారత్– అమెరికా మధ్య వ్యూహాత్మక బంధాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ ప్రతిపాదన తెరమీదికి రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.ఉపగ్రహాల ప్రయోగానికే పరిమితం కాకుండా మానవసహిత అంతరిక్ష యాత్రలు, చంద్రుడిపై శాశ్వత పరిశోధనల దిశగా ఇరు దేశాలు సంయుక్తంగా అడుగులు వేస్తోన్నాయి. బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయంలో తొమ్మిదవ భారత్–అమెరికా పౌర అంతరిక్ష జాయింట్ వర్కింగ్ సమావేశం సందర్భంగా నాసా ఈ ప్రతిపాదన పెట్టింది. ఇస్రోకు ఆహ్వానాన్ని సైతం అందజేసింది. మూన్ బేస్ మిషన్ ఆధారంగా ఆర్టెమిస్ కాంట్రాక్ట్ పరిధిని మరింత విస్తృతం కానుంది.ఈ నూతన భాగస్వామ్యం ద్వారా చంద్రుడిపై పరిశోధనలతో పాటు శాస్త్రీయ సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడానికి ఇస్రో– నాసా అంగీకారం తెలిపాయి కూడా. ఈ సమావేశానికి ఇస్రో చైర్మన్ వీ నారాయణన్, భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్, యూఆర్ రావు శాటిలైట్ సెంటర్ డైరెక్టర్ ఎం. శంకరన్, అమెరికా విదేశాంగ శాఖ సహాయ కార్యదర్శి వెస్లీ బ్రూక్స్, నాసా అసోసియేట్ అడ్మినిస్ట్రేటర్ కాథ్లీన్ కరికా హాజరయ్యారు.గత ఏడాది నాసా ఇస్రో సింథటిక్ అపెర్చర్ రాడార్ ప్రాజెక్ట్ విజయం తర్వాత, ఈ రెండు దేశాలు సంయుక్తంగా మళ్లీ అంతరిక్ష ప్రయోగాల వైపు చూపు సారించడం ఇదే మొదటిసారి. స్పేస్ రీసెర్చ్ లో తమ బంధాన్ని మరింత విస్తరించాలని నిర్ణయించాయి.



ఇందులో భాగంగానే మూన్ బేస్ నిర్మాణంలో ఇస్రో భాగస్వామ్యాన్ని కోరుకుంటోంది నాసా. ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్స్ కే పరిమితం కాకుండా మానవసహిత ప్రయోగాలు, భవిష్యత్తులో చేపట్టబోయే అంతరిక్ష యాత్రలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.చంద్రుడిపై శాశ్వత స్థావరాన్ని ఏర్పాటు చేయడానికి భారత్ నుంచి లభించే సాంకేతిక నైపుణ్యం ఎంతగానో దోహదపడుతుందని అమెరికా భావిస్తోంది. అంతరిక్ష కార్యకలాపాల దీర్ఘకాలిక సుస్థిరత కోసం ఐక్యరాజ్యసమితి రూపొందించిన మార్గదర్శకాలకు కట్టుబడి ఉంటామని భారత్, అమెరికా ఇప్పటికే పునరుద్ఘాటించాయి కూడా. అంతరిక్షంలో వ్యర్థాల నియంత్రణ, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం, విశ్వంలో మానవ కార్యకలాపాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ అంతర్జాతీయ నిబంధనలను పాటించడం అత్యంత కీలకం కానుంది.భారత్ సొంతంగా చేపడుతున్న గగన్‌యాన్ మానవ సహిత అంతరిక్ష యాత్రకు కూడా అమెరికా సాంకేతిక సహకారం ఎంతో కీలకం కానుంది. స్పేస్ విజన్ లక్ష్యాల సాధనలో భాగంగా చంద్రుడిపై మరింత క్రియాశీలక పాత్ర పోషించాలని భారత్ భావిస్తోంది. చంద్రయాన్ 3 ల్యాండర్ అడుగుపెట్టిన శివశక్తి పాయింట్ ఇప్పటికే చంద్రుడిపై భారత్ సత్తాకు ప్రతీకగా నిలిచింది. ఇప్పుడు నాసాతో జతకట్టడం ద్వారా చంద్రుని పునరాగమన ప్రస్థానంలో భారత్ తన విశిష్ట స్థానాన్ని దక్కించుకోనుంది.

## కశ్విక ప్రాణాల కోసం సాగుతున్న పోరాటం.. దాతల చేయూతతో రూ.25 వేల సాయం

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 11, ఖమ్మం జిల్లా ప్రతినిధి : అనారోగ్యంతో వైద్య చికిత్స పొందుతున్న చిన్నారి కశ్వికను ఆదుకునేందుకు దాతలు ముందుకు వస్తున్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జీళ్లచెరువు గ్రామంలో చిన్నారి కుటుంబాన్ని మంగళవారం పరామర్శించిన మంద ప్రకాష్, దాతల సహకారంతో సేకరించిన రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని చిన్నారి తండ్రి కంపాటి రవీందర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారి ఆరోగ్య పరిస్థితిని, కొనసాగుతున్న చికిత్స వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కశ్విక వైద్యానికి ఇప్పటివరకు దాతల సహకారంతో పాటు తన వంతుగా మొత్తం రూ.31 వేల ఆర్థిక సహాయం అందించినట్లు మంద ప్రకాష్ తెలిపారు. అయితే చిన్నారి చికిత్సకు ఇంకా రూ.30 లక్షలకు పైగా ఖర్చు అవసరమవుతున్న నేపథ్యంలో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. బిడ్డను కాపాడుకోవాలనే ఆశతో తల్లిదండ్రులు ప్రయత్నాలు కొనసాగిస్తుండగా, దాతల నుంచి అందుతున్న సహాయం వారికి కొంత భరోసాను కల్పిస్తోంది. ఒక్కరి చిన్న సహాయం కూడా ఒక చిన్నారి జీవితంలో పెద్ద మార్పు తీసుకురాగలదు. కశ్విక వైద్యానికి ఇంకా భారీ మొత్తం అవసరం ఉంది. అందుకే మానవతా దృక్పథంతో దాతలు ముందుకు రావాలి" అని మంద ప్రకాష్ చేతులు జోడించి విజ్ఞప్తి చేశారు.



ఇప్పటికే స్పందించి సహాయం అందించిన ప్రతి దాతకు కృతజ్ఞతలు తెలిపారు. కశ్విక త్వరగా కోలుకుని ఆరోగ్యంగా తల్లిదండ్రుల చెంతకు చేరుకోవాలని దాతలు, స్థానికులు ఆకాంక్షించారు.

## విజ్ఞాన్ హైస్కూల్లో ఘనంగా బోనాల వేడుకలు




**హైదరాబాద్ పల్స్ న్యూస్ ఆగష్టు 11, నారాయణఖేడ్,**
నారాయణ ఖేడ్ పట్టణంలోని విజ్ఞాన్ హైస్కూల్లో ఆషాఢమాస బోనాల ఉత్సవాలను పాఠశాల కరస్పాండెంట్ జి. సురేష్ గౌడ్, డైరెక్టర్ డాక్టర్ దిగ్గే బాబు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం విద్యార్థులు సంప్రదాయ వేషధారణలో పాల్గొని, వివిధ కళా ప్రదర్శనలు, నృత్యాలతో అలరించారు. విద్యార్థుల సంప్రదాయ వేషభూషణాలు, నృత్య ప్రదర్శనలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. బోనాల పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, విద్యార్థులు మన సంస్కృతిని గౌరవిస్తూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ ఖేడ్ లో అక్రమ స్మశాన వాటిక

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగష్టు 11, నారాయణ ఖేడ్,**
బారతీయ జనతా పార్టీ నారాయణఖేడ్ ఆధ్వర్యములో డిప్యూటీ కలెక్టర్ ని కలిసి అక్రమ స్మశాన వాటిక పైన పిర్యాధు చేయడం జరిగింది,ఈ కార్యక్రములో ఉద్దేశించి బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్ నారాయణఖేడ్ పట్టణంలోని బతుకమ్మ కుంట అని పిలువబడే స్థలంలో



అక్రమంగా గతంలో దర్గా నిర్వహించి ఇప్పుడు ఏమో ఆ స్థలాన్ని మొత్తం కబ్జా చేస్తూ ఒక వర్గం వారు అక్రమంగా నిన్న రాత్రి రాత్రికే బోర్డు నిర్వహించారు అక్కడ ఉన్న హిందువులు కుటుంబాలు భయోందాలన చెందుతున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోకపోతే రాబోయే రోజుల్లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని వారు అన్నారు పట్టణ అధ్యక్షులు రాజు గౌడ్ మండల అధ్యక్షులు దశరథ్ నాయుకులు పట్నం మాణిక్,ప్రశాంత్,సాయి పటేల్,సాగునాకర్ పటేల్, అంజి రెడ్డి, సాయేందర్, ఎస్సీ మోర్చా నాయుకులు సుధాకర్, ప్రవీణ్,మరియు రవి యాదవ్,సురేష్ కుమార్,పూసిని మాణిక్యం, రాజు బొమ్మ,రవి కుమార్, వెంకట్ రెడ్డి,చందాపూర్ దశరథ్, తదితరులు పాలుగొనడం జరిగింది

## అధిక ధరలకు అమ్ముతున్న ఫర్టిలైజర్లపై చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగష్టు 11, నారాయణ ఖేడ్,
సిపిఎం రమేష్ మాట్లాడుతూ నారాయణఖేడ్ మండల కేంద్రంలో అన్నదాత మరియు శ్రీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్



యజమాన్యులు అడుగు మందులు రైతులకు డీఏపీ 1350 ఉంట్టే 1600 కు అమ్ముతున్నారు 20-20 స్పీక్ 1800 ఉంటే 2000 వేలకు ఇస్తున్నారు ఈ విషయం అగ్రికల్చర్ మండల అధికారితో మాట్లాడితే ఫర్టిలైజర్ యజమానులకు సపోర్ట్ చేసినట్టు మాట్లాడుతున్నారు అధిక ధరలకు అడుగు మందులు అమ్ముతున్న ఫర్టిలైజర్ పై అధికారులు రైతుల రూపంలో వెళ్లి తనిఖీలు చేసి ఆయా ఫర్టిలైజర్ల లైసెన్సును రద్దు చేయాలని అన్నారు ఇలా అడ్డగోలుగా విక్రయిస్తే రైతులు ఎలా వ్యవసాయం చేస్తారని అందుకే అప్పుల పాలు అయి రైతు ఆత్మహత్యకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా పై అధికారులు వెంటనే ఫర్టిలైజర్లపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు

హైదరాబాద్ పల్స్

## వరదలను దాటుకుని..సర్వం కోల్పోయినా పట్టు సడలని ధైర్యం

గువాహటి: ఆత్మ విశ్వాసం, సాధించాలన్న పట్టుదల ఉంటే ఎన్ని అడ్డంకులెదురైనా లక్ష్యం ముందు చిన్నబోతాయని మరోసారి నిరూపించింది అసోం అమ్మాయి జాన్మోని కోవర్. ఇటీవల ఆ రాష్ట్రాన్ని ముంచెత్తిన వరదల కారణంగా సర్వం కోల్పోయి కుటుంబంతో కలిసి చిన్న టెంట్‌లో తలదాచుకుంటున్న 17 ఏండ్ల కోవర్.. తన కలలను, లక్ష్యాన్ని మాత్రం వదులుకోలేదు. ఈ నెల 7-9 మధ్య ఢిల్లీలో జరిగిన నేషనల్ కరాటే చాంపియన్‌షిప్స్‌లో పాల్గొన్న ఆమె స్వర్ణం గెలిచి అందరి ప్రశంసలూ అందుకుంటున్నది. జాన్మోనిది జోర్హాట్ జిల్లా బోగ్దోయిపొరియా గ్రామం. గతనెల సంభవించిన వరదలతో వారి ఊరు మొత్తం నీటమునిగింది. చేపలు పడుతూ బతుకునీడుస్తున్న వారి కుటుంబం.. వరదల కారణంగా ఇల్లు వదిలి టార్పాలిన్ గుడారాల కింద బతుకుతున్నారు. ఐదేండ్ల వయసులోనే కరాటేలో మెళకువలు నేర్చుకున్న కోవర్ ఢిల్లీకి వెళ్లాల్సి ఉన్నా వరదలు, పేదరికం ఆమె



లక్ష్యానికి అడ్డంగా నిలిచాయి. కానీ ఆమె స్థితిని తెలుసుకున్న ఫిజిక్స్ వాలా వ్యవస్థాపకుడు అలక్ పాండే.. జాన్మోనికి చేయూతనందించాడు. ఢిల్లీ వెళ్లేందుకు సాయం చేయడమే గాక అక్కడ ఆమె ఖర్చులనూ భరించాడు. వరదలు ఇంటిని ముంచేసినా తన కలలను మాత్రం అడ్డుకోలేకపోయాయి. పోటీల్లో స్వర్ణం గెలిచి ఇంటికి వచ్చిన కోవర్.. కుటుంబంతో కలిసి మళ్లీ అదే గుడారాల్లో నివసిస్తుండటం గమనార్హం.

## సమర సన్నాహం.. కొలంబోలో 6 రోజుల పాటు భారత్ ముమ్మర ప్రాక్టీస్






శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్ కోసం భారత్ మునుపెన్నడూ లేని విధంగా సన్నద్ధం అవుతోంది. ఈనెల 4న కొలంబోలో అడుగుపెట్టడం మొదలు అక్కడి నాన్‌డెస్క్రిప్ట్ క్రికెట్ క్లబ్ (ఎన్‌సీసీ) మైదానంలో వరుసగా ఆరు రోజుల పాటు ఎలాంటి విరామం లేకుండా చెమటలు చిందించింది. ఇందులో మూడు రోజుల పాటు సాగిన పూర్తి స్థాయి వామప్ మ్యాచ్‌తో పాటు, మిగిలిన రోజుల్లో రోజుకు ఐదు నుంచి ఆరు గంటల పాటు సాగిన కఠిన నెట్ సెషన్లు ఉన్నాయి. గిల్‌సేన ఇంత ముమ్మరంగా సాధన చేయడం వెనుక రెండు కారణాలున్నాయి. ఒకటి 18 ఏండ్ల నుంచి లంకపై ఒక్క టెస్టు సిరీస్ కోల్పోని రికార్డును కొనసాగించడం..రెండోది ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ రేసులో నిలవాలంటే ఈ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాల్సిన అవసరం ఉండటం. దాంతో ఈనెల 15న మొదలయ్యే సిరీస్ కోసం టీమ్ మేనేజ్‌మెంట్ ఏ చిన్న పొరపాటుకు కూడా తావివ్వకుండా పక్కా ప్రణాళికతో ఆటగాళ్లను సిద్ధం చేస్తోంది.

ఓవైపు వామప్.. ఇంకోవైపు నెట్ సెషన్

ప్రస్తుత జట్టులో కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్‌కు మాత్రమే లంకలో టెస్టు మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఉంది. మిగిలిన ఆటగాళ్లందరికీ ఇక్కడి పరిస్థితులు కొత్త. అందుకే లంకలో అడుగుపెట్టిన 24 గంటల్లోనే మైదానంలోకి దిగిన జట్టు ఇక్కడి విపరీతమైన వేడి, తీవ్రమైన తేమతో కూడిన వాతావరణానికి ఆటగాళ్లు అలవాటుపడేలా హెడ్ కోచ్ గంభీర్ ప్రాక్టీస్ సెషన్స్‌ను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, తిరిగి 2 నుంచి సాయంత్రం 5.30 వరకు రెండు విడతలుగా విభజించాడు.లంక ఎలెవన్‌తో జరిగిన వామప్ మ్యాచ్ సమయంలోనూ ఫీల్డింగ్ చేస్తున్న ఆటగాళ్లను మారుస్తూ, ఒకవైపు మ్యాచ్ ఆడుతూనే మరోవైపు సమాంతరంగా నెట్స్ ప్రాక్టీస్ చేయించడం గమనార్హం. ఎన్‌సీసీ మైదానంలో జరిగిన శిక్షణ ఎంత తీవ్రంగా సాగిందంటే, ప్రాక్టీస్ సెషన్ అని చూడకుండా ఫాస్ట్ బౌలర్లు నెట్స్‌లో పూర్తి వేగంతో విరుచుకుపడ్డారు. పంజాబ్ పేసర్ గుర్నూర్ బ్రార్ విసిరిన ఓ బంతి కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కుడి చేతి వేలుకు బలంగా తాకి గాయపరిచింది. ముందు జాగ్రత్తగా వామప్ మ్యాచ్ రెండు రోజుల ఆటకు దూరంగా ఉన్న గిల్ ఆఖరి రోజున ఓపెనర్‌గా బరిలోకి దిగి మెరుపు ఇన్నింగ్స్ ఆడి తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకున్నాడు.

పగుళ్ల పిచ్‌పై స్పిన్నర్లను ఎదుర్కొంటూ..

మూడు రోజుల వామప్ మ్యాచ్ ముగిసిన తర్వాత సోమవారం జట్టుకు విశ్రాంతి ఇస్తారని భావించినప్పటికీ, ప్రధాన పేసర్లను మినహాయించి మిగిలిన ఆటగాళ్లంతా ఎన్‌సీసీ మైదానంలో మళ్లీ మూడు గంటలకు పైగా చెమటోడ్చారు. టెస్టు మ్యాచ్‌లో నాలుగో రోజు నాటి పిచ్‌ను తలపించేలా పగుళ్లు ఉండి, స్పిన్, రివర్స్ స్వింగ్‌కు అనుకూలించేలా వికెట్‌ను తయారు చేయించుకొని మరీ దీనిపై జట్టులోని నలుగురు స్పిన్నర్లు రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్, మానవ్ సుతార్, సారాంశ్ జైన్ బౌలింగ్‌లో బ్యాటర్లు తమ డిఫెన్స్, ఫుట్‌వర్క్‌ను మెరుగుపరుచుకోవడంపై దృష్టి సారించారు.

సీనియర్ బ్యాటర్ రాహుల్ స్పిన్నర్లను ఎదుర్కొనేందుకు ప్రత్యేకంగా స్వీప్, రివర్స్ స్వీప్ షాట్లపై సాధన చేశాడు. గతంలో ఇంగ్లండ్, ఐర్లాండ్ పర్యటనల్లో పరిస్థితులకు వేగంగా అలవాటు పడకపోవడం వల్ల జరిగిన నష్టాన్ని పునరావృతం కాకుండా చూడాలనే కసి జట్టులో స్పష్టంగా కనిపిస్తోంది. కొలంబోలో ఆరు రోజులు ఉన్న గిల్‌సేన తొలి టెస్టు కోసం మంగళవారం గాలెకు చేరుకుంది. బుధవారం ఒక్క రోజు విశ్రాంతి తీసుకొని గురువారం నుంచి మళ్లీ ప్రాక్టీస్ మొదలుపెట్టి గాలె టెస్టులో ఆడే తుది జట్టుపై ఓ అంచనాకు రానుంది.

రివర్స్ స్వింగ్ కోసం గిల్ ప్రత్యేక సాధన

లంక పిచ్‌లపై ప్రధాన సవాలుగా మారే రివర్స్ స్వింగ్‌ను ఎదుర్కొనేందుకు గిల్ ప్రత్యేక ప్రణాళికను అమలు చేశాడు. టీమ్ మేనేజ్‌మెంట్ ప్రత్యేకంగా తెప్పించిన కూకబురా రెడ్ బాల్స్‌లో కొద్దిగా పాతబడ్డ (సెమీ ఓల్డ్) బంతులతో ప్రాక్టీస్ చేశాడు. త్రో-డౌన్ స్పెషలిస్టులతో పాటు పేసర్ ఆకిబ్ నబీ బౌలింగ్‌లో రివర్స్ స్వింగ్ అవుతున్న బంతులను దాదాపు 20 నిమిషాల పాటు ఎదుర్కొన్నాడు. శ్రీలంకలోని పొడి వాతావరణం, రఫ్ ఔట్‌ఫీల్డ్ వల్ల బంతి త్వరగా మెరుపు కోల్పోయి రివర్స్ స్వింగ్‌కు అనుకూలిస్తుంది. దీనికి కౌంటర్ ఇచ్చేందుకు గిల్ పాత బడ్డ బంతులతో ప్రాక్టీస్ చేశాడు.

# అత్యాచారం కేసులో పోరెల్ అరెస్ట్

కోల్‌కతా: బెంగాల్ క్రికెటర్, ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆడే వికెట్ కీపర్ అభిషేక్ పోరెల్ అరెస్టయ్యాడు. ఒక అమ్మాయిని ప్రేమించి పెండ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేయడమే గాక ఆమెను లైంగికంగా వాడుకుని వదిలేశాడని అతడిపై కేసు నమోదైంది. వివరాల్లోకెళ్తే.. మూడున్నరేండ్లుగా పోరెల్, కర్నాటకకు చెందిన మెడికో ప్రేమలో ఉన్నారు. ఇద్దరూ కలిసి విదేశాలకూ వెళ్లారు. అయితే పెండ్లి చేసుకుంటానని చెప్పిన పోరెల్.. తనను శారీరకంగా వాడుకున్నాడని, కానీ కొంతకాలంగా పెండ్లి ప్రస్తావన తీసుకువస్తే అతడు మొహం చాటేస్తున్నాడని బాధితురాలు ఈ ఏడాది జూన్ 23న మోగ్రా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. యువతి




ఫిర్యాదు మేరకు చందానగర్‌లోని పోరెల్ నివాసానికి పలుమార్లు వెళ్లినా పోలీసులకు అతడి ఆచూకీ దొరకలేదు. దీంతో యువతి కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించింది. కోర్టు ఆదేశాల మేరకు సోమవారం రాత్రి హుగ్లీలో అభిషేక్‌ను అదుపులోకి తీసుకున్నట్టు హుగ్లీ రూరల్ ఎస్పీ కున్వార్ భూషణ్ తెలిపారు.

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.